# డిజిటల్ ఏఐ యుగంలో పత్రికా స్వేచ్ఛకి సవాళ్లు

1993 నుంచి ప్రతి ఏట 03 మే రోజున ఐరాస అనుబంధ సంస్థ యునెస్కో "ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం (వరల్డ్ పిరెస్ ఫ్రీడం డే)" నిర్వహిస్తున్నది. 1991లో పత్రికా స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, బహువచన పత్రికారంగం కోసం "విండ్‌హోక్ డిక్లరేషన్" చేసిన సందర్భానికి గుర్తుగా 03 మే రోజున నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పత్రికారంగ సంక్లిష్ట సమస్యలు, జర్నలిస్టులను ఏకతాటిపైకి తీసుకురావడం, పత్రికారంగానికి చెందిన పాలసీలు తీసుకురావడం, మీడియా వ్యక్తులు, పౌర సమాజ పాత్రలను చర్చించడానికి ఈ వేదికలను వినియోగించడం జరుగుతోంది. కృత్రిమ మేధ కొత్త పుంతలు తొక్కడంతో పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువలు కూడా ప్రభావితం కావడం చూస్తున్నాం. ఇదే వేదికగా విధి నిర్వహణలో అమరత్వం పొందిన జర్నలిస్టుల సేవలను

**(03 మే "ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం" సందర్భంగా)**

గుర్తు చేసుకోవడం, పత్రికా స్వేచ్ఛ కాపాడటంలో ప్రభుత్వాల పాత్రను గుర్తు చేయడం కూడా జరుగుతుంది.

## 2025 ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవ ఇతివృత్తం:

ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం-2025 ఇతివృత్తంగా "డిజిటల్ యుగంలో రిపోర్టింగ్ : పత్రికా స్వేచ్ఛపై ఏఐ ప్రభావం" అనబడే అంశాన్ని తీసుకొని అవగాహన కల్పించడం జరుగుతున్నది. నవ్య సాంకేతిక విప్లవ తుఫానులో జర్నలిస్టుల విధులు కూడా పునర్నిర్వచించబడడం, అన్వేషణాత్మక రిపోర్టింగ్‌లో కొత్త దారులు తెరుచుకోవడం, సమాచారం సులభంగా అందుబాటులోకి రావడం, నిజనిర్ధారణకు నవ్య మార్గాలు ఏర్పడడం, బహు భాషల సమాచారం అందుబాటులోకి రావడం, కార్యదక్షత పెరగడం, డాటా విశ్లేషణ తేలిక కావడం లాంటి ప్రధాన ప్రయోజనాలే కాకుండా ఏఐతో తప్పుడు సమాచారాలు, సమాచారం అందకపోవడం, డీప్ ఫేక్ టెక్నాలజీ తిప్పలు, పక్షపాత సమాచారం, జర్నలిస్టులపై నిఘా పెరగడం, పని సమానమైన వేతనాలు అందకపోవడం, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా స్వార్థపర రాజకీయ నాయకుల చేతుల్లోకి వెళ్లడం, పత్రికా రంగ విలువలు పలుచబడడం, యెల్లో జర్నలిజం పురుడు పోసుకోవడం, జర్నలిస్టులపై హత్యాప్రయత్నాలు జరగడం, విలేకరుల కలం నోళ్లు నొక్కడం, జర్నలిజంలో రాజకీయాలు ప్రవేశించడం లాంటి అవలక్షణాలు కూడా పుట్టుకొస్తున్నాయి.

## పత్రికా స్వేచ్ఛకు దోహదపడే అంశాలు:

ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం వేదికగా మీడియా స్వేచ్ఛకు సంబంధించిన మౌలిక సూత్రాలపై దృష్టి సారించడం, నిష్పక్షపాతంగా రిపోర్టింగ్ చేయడానికి తగు స్వేచ్ఛను కల్పించడం, రాజకీయ ప్రమేయాలను తగ్గించడం, నిజాయితీ కలిగిన జర్నలిస్టులపై జరిగే దాడులను ఖండిస్తూ అక్రమార్కుల భరతం పట్టడం, పారదర్శకత పాటించడం, జవాబుదారీ తనాన్ని ప్రోత్సహించడం, ప్రపంచ స్థాయి ఐక్యత సాధించడం, వివిధ మీడియా గ్రూపులను ఏకం చేయడం, పత్రికా స్వేచ్ఛను పరిరక్షించే అంతర్జాతీయ వేదికలను ఏర్పాటు చేయడం, ప్రజల్లో అవగాహన కల్పించడం లాంటి అంశాలను చర్చించడం సముచితంగా ఉంటుంది. పత్రికా స్వేచ్ఛను ప్రభావితం చేయడంలో రాజకీయ, చట్టపరమైన, ఆర్థిక, సామాజిక అంశాలు ఉపయోగపడతాయి. పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు పడితే అన్యాయం రాజ్యమేలుతుంది, పేదరికం వెక్కిరిస్తుంది. సమన్యాయం, అభివృద్ధి, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ లాంటివి సాధించడానికి పత్రికా స్వేచ్ఛ ఎంతగానో దోహదపడుతున్నదని తెలుసుకోవలసిన సమయం ఆసన్నమైంది. నేటి పత్రికా స్వేచ్ఛ, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, మీడియా మిత్రుల భద్రత లాంటివి రేపటి సమసమాజ స్థాపనకు ఊతం ఇస్తుందని నమ్ముతూ మన బంగారు భవిష్యత్తుకు ఉపకరించే జర్నలిస్టుల సంపూర్ణ స్వేచ్ఛను బహుమతిగా అందిద్దాం.

- డా౹౹బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# చిత్ర నిర్మాణం, డిజిటల్ కంటెంట్, గేమింగ్, ఫ్యాషన్, సంగీతం, సంగీత కచేరీలకు భారత్ అంతర్జాతీయ కేంద్రంగా మారుతోంది: పీఎం

న్యూఢిల్లీ, మే 2:మొట్టమొదటి ఆడియో విజువల్ అండ్ ఎంటర్టైన్మెంట్ సమ్మిట్ – వేవ్స్ 2025ను ముంబయిలోని జియో వరల్డ్ సెంటర్లో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి ప్రధాని ప్రసంగించారు. ఈ రోజు ఆవిర్భావ దినోత్సవం జరుపుకొంటున్న మహారాష్ట్ర, గుజరాత్ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన అంతర్జాతీయ ప్రతినిధులు, రాయబారులు, సృజనాత్మక రంగానికి చెందిన నిపుణులను స్వాగతిస్తూ.. వేవ్స్ ప్రాధాన్యాన్ని వివరించారు. 100కు పైగా దేశాకు చెందిన కళాకారులు, ఆవిష్కర్తలు, పెట్టుబడిదారులు, విధాన రూపకర్తలు కలసి అంతర్జాతీయ స్థాయి ప్రతిభ, సృజనాత్మక వ్యవస్థకు పునాది వేశారని పేర్కొన్నారు. "వేవ్స్ కేవలం సంక్షిప్త పదం కాదు.. సంస్కృతిని, సృజనాత్మకతను, అంతర్జాతీయ సంబంధాలను సూచించే తరంగం" అని వర్ణించారు. అలాగే ఈ సదస్సు సినిమాలు, సంగీతం, గేమింగ్, యానిమేషన్, కథలు చెప్పడానికి సంబంధించిన విస్తృతమైన ప్రపంచాన్ని ప్రదర్శిస్తుందని ప్రధాని అన్నారు. అదే సమయంలో కళాకారులు, రూపకర్తలకు భాగస్వామ్యాలు పెంచుకొనేందుకు అంతర్జాతీయ స్థాయి వేదికను ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొంటున్న వారందరికీ శుభకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి దేశవిదేశాల నుంచి హాజరైన విశిష్ట అతిథులకు స్వాగతం పలికారు.

వేవ్స్ సదస్సులో భారతీయ సినిమా చరిత్ర గురించి ప్రముఖంగా ప్రస్తావించారు. దేశంలోనే మొట్టమొదటి ఫీచర్ చిత్రం 'రాజా హరిశ్చంద్ర' 1913, మే 3న విడుదలైందన్నారు. ఈ చలనచిత్రానికి దర్శకత్వం వహించిన దిగ్గజ దర్శకుడు దాదా సాహెబ్ ఫాల్కే జయంతిని నిన్నే జరుపుకొన్నామని ప్రధాని గుర్తు చేశారు. గడచిన శతాబ్దంలో భారతీయ సంస్కృతిని సినిమాలు ప్రపంచవ్యాప్తంగా విజయవంతంగా విస్తరింపచేశాయని తెలిపారు. రష్యాలో రాజ్ కపూర్‌కు ఉన్న ప్రజాదరణను, కేన్స్ ఉత్సవాల్లో సత్యజిత్ రేకు దక్కిన అంతర్జాతీయ గుర్తింపును, ఆర్ఆర్ఆర్ సాధించిన ఆస్కార్ విజయాన్ని ఉదహరించారు. భారతీయ చిత్రదర్శకులు ప్రపంచస్థాయి కథనాలను ఎలా రూపొందిస్తున్నారో వివరించారు. గురుదత్ చిత్రకావ్యాలు, రిత్విక్ ఘటక్ తెరకెక్కించిన సాంఘిక చిత్రాలు, ఏఆర్ రెహ్మాన్ సంగీత ప్రతిభ, ఎస్ఎస్ రాజమౌళి కథన విధానం గురించి వివరించారు. వీరంతా భారతీయ సంస్కృతిని ప్రపంచవ్యాప్తంగా ఉన్న మిలియన్ల మందికి తెలియజేశారని అన్నారు. సినిమా దిగ్గజాలను, సినీ పరిశ్రమకు వారు చేసిన సేవలను స్మారక తపాలా బిళ్లలతో గౌరవమిస్తున్నామని తెలిపారు.

దేశ సృజనాత్మక రంగ సామర్థ్యాన్ని, అంతర్జాతీయ స్థాయిలో సహకారానికున్న ప్రాముఖ్యం గురించి ప్రధానమంత్రి వివరించారు. కొన్నేళ్లుగా గేమింగ్, సంగీతం, చిత్ర దర్శకత్వం, నటన తదితర రంగాలకు చెందిన నిపుణులతో తన ఆలోచనలు పంచుకుని, ఆయా రంగాలపై అవగాహనను మరింత పెంచుకున్నానని తెలిపారు. మహాత్మాగాంధీ 150వ జయంతి సందర్భంగా 150 దేశాలకు చెందిన గాయనీగాయకులు 'వైష్ణవ జనతో' ఆలపించారని గుర్తు చేశారు. ఈ శ్లోకాన్ని 500-600 ఏళ్ల క్రితం నర్సింగ్ మెహతా రాశారని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో చేపట్టిన ఈ కళా ప్రయత్నం గణనీయమైన ప్రభావాన్ని చూపించడంతో పాటు ప్రపంచ సామరస్యాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. ఈ సదస్సుకు హాజరైనవారిలో చాలా మంది గాంధీ మహాత్ముని 150వ జయంతికి సంక్షిప్త వీడియో సందేశాలు రూపొందించి, ఆయన బోధనలను విస్తరించే ప్రయత్నంలో పాలుపంచుకొన్నారని వెల్లడించారు.

భారతీయ సృజనాత్మక శక్తి, అంతర్జాతీయ సహకారాలతో తన సామర్థ్యాన్ని ఇప్పటికే నిరూపించుకుందని తెలిపారు. ఇప్పుడు ఆ లక్ష్యం వేవ్స్ గా కార్యరూపం దాల్చిందని పేర్కొన్నారు.

వేవ్స్ సదస్సు మొదటి సంచిక సాధించిన ఘన విజయాన్ని శ్రీ మోదీ ప్రశంసించారు. ప్రారంభమైన నాటి నుంచే 'స్పష్టమైన ఉద్దేశం'తో ప్రపంచ దృష్టిని ఆకర్షించిందని తెలిపారు. ఈ అంశంలో సదస్సు అడ్వయిజరీ బోర్డు కనబరిచిన చిత్తశుద్ధిని, కృషిని కొనియాడారు. వారి ప్రయత్నాలతోనే సృజనాత్మక రంగంలో వేవ్స్ ఓ ముఖ్యమైన ఘట్టంగా నిలిచిందన్నారు. పెద్ద స్థాయిలో నిర్వహించిన క్రియేటర్స్ ఛాలెంజ్‌ను, క్రియేటోస్ఫియర్ కార్యక్రమాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. వీటిలో 60కి పైగా దేశాల నుంచి సుమారుగా 1,00,000 మంది సృజనాత్మక రంగానికి చెందిన నిపుణులు పాల్గొన్నారని తెలిపారు. 32 పోటీల్లో తుదిపోటీలకు చేరుకున్న 800 మందికి అభినందనలు తెలిపారు. ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశం వారికి లభించిందన్నారు. వేవ్స్ సదస్సులో భాగంగా ఏర్పాటు చేసిన భారత్ పెవిలియన్లో ప్రదర్శించిన సృజనాత్మక అంశాలను ప్రధానమంత్రి ఆసక్తి కనబరిచారు. గణనీయమైన ఆవిష్కరణలను సాధించామని పేర్కొంటూ ఇప్పుడు అవి కార్యరూపం దాల్చే సమయం కోసం ఎదురుచూస్తున్నామని తెలిపా రు. కొత్త క్రియేటర్లను ప్రోత్సహిం చడంలో వారిని, అభివృద్ధి చెందుతు న్న మార్కెట్లకు అనుసంధానించడంలో వేవ్స్ బజార్ సామర్థ్యాన్ని ప్రముఖంగా వివరించారు. కళా రంగంలో కొనుగోలుదారులు, అమ్మకందారులను అనుసంధానించాలనే ఆలోచనను ప్రశంసించారు. ఇలాంటి కార్యక్రమా లు క్రియేటివ్ ఎకానమీని బలోపేతం చేసి కళాకారులకు నూతన అవకాశా లను కల్పిస్తాయని పేర్కొన్నారు.సృజనాత్మకతకు, మానవజీవితానికి మధ్య ఉన్న గాఢమైన సంబంధాన్ని వివరిస్తూ శిశువు జీవిత ప్రయాణం తల్లి జోలపాటతోనే మొదలవుతుందన్నారు. శబ్దంతోనూ, సంగీతంతోనూ వారికి మొదట పరిచయమయ్యేది అక్కడే అన్నారు. చిన్నారి కలలను తల్లి అల్లినట్టుగానే, ఓ యుగపు కలను సృజనాత్మక నిపుణులు రూపొందిస్తారని అన్నారు. తమ కళ ద్వారా కొన్ని తరాలను ప్రభావితం చేయగల దార్శనిక వ్యక్తులను ఒక్క చోటుకి తీసుకురావడంలోనే వేవ్స్ విజయం దాగి ఉందని తెలిపారు.

సమష్టి ప్రయత్నాలపై తనకున్న విశ్వాసాన్ని తెలియజేస్తూ.. కళాకారులు, క్రియేటర్లు, ఈ రంగంలోని దిగ్గజాల అంకిత భావం రానున్న కాలంలో వేవ్స్ ను కొత్త శిఖరాలకు చేరుస్తుందని తెలిపారు. భవిష్యత్తులో ఈ కార్యక్రమాన్ని మరింత విజయవంతం చేయడానికి తమ సహకారాన్ని ఇలాగే కొనసాగించాలని పరిశ్రమ సహచరులను కోరారు. ఈ కార్యక్రమానికి మరింత ఉత్తేజకరమైన అంశాలు జోడిస్తున్నామంటూ.. భవిష్యత్తులో వేవ్స్ పురస్కారాలను ప్రారంభిస్తామని ప్రకటించారు. ఇవి కళ, సృజనాత్మక ప్రపంచంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైనవిగా మారతాయని తెలిపారు. నిరంతరం అంకితభావంతో ఉండాల్సిన అవసరాన్ని తెలియజేస్తూ.. సృజనాత్మకత ద్వారా ప్రపంచవ్యాప్తంగా ప్రజల మనసులను గెలుచుకోవడం, తరాలకు స్ఫూర్తినివ్వడమే లక్ష్యమని అన్నారు.

భారత వేగవంతమైన ఆర్థిక పురోగతిని ప్రస్తావిస్తూ.. దేశం ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశగా పయనిస్తోందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. అంతర్జాతీయంగా ఆర్థిక సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో భారత్ మొదటి స్థానంలో నిలిచిందని, మొబైల్ తయారీలో రెండో అతిపెద్ద దేశంగా ఉందని, అంకుర సంస్థల పరంగా ప్రపంచంలో మూడో అతిపెద్ద దేశంగా అవతరించిందని తెలిపారు. అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగే దిశగా భారత్ ప్రస్థానం ఇప్పుడిప్పుడే మొదలైందని, సాధించాల్సింది ఇంకా చాలా ఉందని ఆయన స్పష్టం చేశారు. "వంద కోట్ల జనాభాకు మాత్రమే కాదు, వంద కోట్లకు పైగా విజయగాథలకూ భారత్ నిలయం" అని ఆయన పేర్కొన్నారు. భారతదేశ గొప్ప కళాత్మక చరిత్రను ప్రస్తావిస్తూ.. రెండు వేల ఏళ్ల కిందటే భరత ముని నాట్యశాస్త్రం భావోద్వేగాలను, మానవానుభవాలను రూపుదిద్దడంలో కళ ఎంతటి శక్తిమంతమైనదో స్పష్టం చేసిందని ఆయన గుర్తు చేశారు. శతాబ్దాల క్రితమే కాళిదాసు రచించిన అభిజ్ఞాన శాకుంతలం శాస్త్రీయ నాటకానికి కొత్త దిశను పరిచయం చేసిందని పేర్కొన్నారు. ఇక్కడ వీధి వీధికీ ఓ చరిత్ర ఉందని, ప్రతి పర్వతమూ పాటను పలికిస్తుందని, నదులన్నీ రాగాలను వినిపిస్తాయని చెప్తూ.. భారత్‌కు దృఢమైన సాంస్కృతిక మూలాలున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. దేశంలోని ఆరు లక్షల గ్రామాల్లో ఒక్కో ఊరికీ సొంత జానపద సంప్రదాయాలూ విశిష్టమైన కథన శైలీ ఉన్నాయన్నారు. జానపద కథల ద్వారా ఆ సమాజాలు తమ చరిత్రను పరిరక్షించుకుంటున్నాయని తెలిపారు. భజనలు, గజళ్లు, శాస్త్రీయమైన కూర్పులు లేదా సమకాలీన బాణీలు... ఏవైనా సరే, ప్రతి స్వర మాధుర్యానికీ ఓ గాథ ఉన్నదని, ప్రతి లయకూ ఆత్మ ఉన్నదని భారతీయ సంగీత ఆధ్యాత్మిక విశిష్టతను ఆయన ప్రస్తావించారు.

నాద బ్రహ్మ (దైవిక ధ్వని) భావనను వివరిస్తూ.. బలంగా వేళ్లూనుకుని ఉన్న భారత కళాత్మక, ఆధ్యాత్మిక వారసత్వాన్ని వేవ్స్ సదస్సులో శ్రీ మోదీ ప్రముఖంగా ప్రస్తావించారు. శివుడి ఢమరుకాన్ని తొలి విశ్వ శబ్దంగా, సరస్వతీ దేవి వీణను జ్ఞాన లయగా, కృష్ణుడి వేణువును శాశ్వత ప్రేమ సందేశంగా, మహా విష్ణువు శంఖాన్ని సానుకూల శక్తినిచ్చేదిగా అభివర్ణిస్తూ– భారతీయ పురాణాలు సంగీతం, నృత్యాల ద్వారా ఎల్లవేళలా దైవత్వాన్ని వ్యక్తం చేశాయని ఆయన వ్యాఖ్యానించారు. సదస్సులో మంత్రముగ్ధులను చేసేలా సాగిన సాంస్కృతిక ప్రదర్శన కూడా ఈ గొప్ప వారసత్వాన్ని ప్రతిబింబించిందని ఆయన పేర్కొన్నారు. 'ఇదే సరైన సమయం' అని ప్రకటిస్తూ.. 'క్రియేట్ ఇన్ ఇండియా, క్రియేట్ ఫర్ ది వరల్డ్' అన్న భారత్ లక్ష్యాన్ని శ్రీ మోదీ పునరుద్ఘాటించారు. వేల ఏళ్ల నాటి అమూల్యమైన సంపద దేశ కథన సంప్రదాయానికి ఉందన్నారు. భారతదేశ గాథలు కాలాతీతమైనవని, ఆలోచనను రేకెత్తించేవని, అంతర్జాతీయమైనవని వ్యాఖ్యానించిన శ్రీ మోదీ.. ఇందులో సాంస్కృతిక ఇతివృత్తాలు మాత్రమే కాకుండా శాస్త్రీయత, క్రీడలు, ధైర్య సాహసాలు కూడా ఉన్నాయని వివరించారు. దేశంలోని కథన రంగం సైన్స్‌ను కాల్పనికత, వీరత్వం, సృజనాత్మకతతో మేళవించి.. విస్తృతమైన, వైవిధ్యమైన సృజనాత్మక వ్యవస్థను నెలకొల్పుతుందని ఆయన వ్యాఖ్యానించారు. అసాధారణమైన భారతదేశ గాథలను ప్రపంచంతో పంచుకోవడంతోపాటు కొత్త, ఆకర్షణీయమైన విధానాల ద్వారా వాటిని భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యతను వేవ్స్ వేదిక తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రజా పద్మ పురస్కారాలకూ వేవ్స్ సదస్సు లక్ష్యానికీ పోలిక ఉందని చెప్పారు. దేశంలోని మారుమూల ప్రాంతాల నుంచీ ప్రతిభావంతులను గుర్తించి, వారి అభ్యున్నతికి దోహదపడడమే ఈ రెండు కార్యక్రమాల లక్ష్యమని ప్రధానమంత్రి పేర్కొన్నారు. స్వాతంత్ర్యానంతరం కొన్నేళ్లకే పద్మ పురస్కారాలు ప్రారంభమైనప్పటికీ, మారుమూల ప్రాంతాల నుంచీ దేశానికి విశేష సేవలందిస్తున్న వ్యక్తులను గుర్తించడం ద్వారా 'ప్రజా పద్మాల'ను భారత్ ఆదరించిన వేళ వాటిలో విప్లవాత్మకమైన మార్పులొచ్చాయని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. ఈ మార్పు వల్ల ఈ పురస్కారాలు ఓ లాంఛనమైన వేడుక స్థాయి నుంచి జాతీయ పండుగగా మారాయని పేర్కొన్నారు. అదేవిధంగా సినిమా, సంగీతం, యానిమేషన్, గేమింగ్ రంగాల్లో దేశంలోని అపారమైన సృజనాత్మక ప్రతిభకు అంతర్జాతీయ వేదికగా వేవ్స్ నిలుస్తుందని, దేశంలోని అన్ని ప్రాంతాల కళాకారులకూ ప్రపంచ స్థాయి వేదికపై తగిన గుర్తింపు లభిస్తుందని ప్రధానమంత్రి అన్నారు.

విభిన్నమైన భావనలు, సంస్కృతులను ఆదరించగల భారతీయ సంప్రదాయాన్ని ఓ సంస్కృత వచనం ద్వారా ప్రస్తావిస్తూ.. భారతీయ నాగరికతా సౌహార్ద్రత పార్సీలు, యూదుల వంటి సమాజాలను స్వాగతించిందని, వారు ఈ దేశంలో విశేషంగా పురోగతి సాధించి సాంస్కృతిక నిర్మాణంలో అంతర్భాగమయ్యారని శ్రీ మోదీ వివరించారు. కార్యక్రమానికి హాజరైన వివిధ దేశాల మంత్రులు, ప్రతినిధులనుద్దేశించి మాట్లాడుతూ– ప్రతి దేశమూ ఎన్నో విజయాలు సాధించిందని, విశేషంగా కృషి చేసిందని ఆయన పేర్కొన్నారు. కళకు సంబంధించి ప్రపంచం సాధించిన విజయాలను గౌరవించడమే భారతదేశ బలమన్న ఆయన.. సృజనాత్మక సహకారంపట్ల దేశ నిబద్ధతను పునరుద్ఘాటించారు. విభిన్న సంస్కృతులు, దేశాల విజయాలను ప్రతిబింబించే కంటెంట్ సృజన ద్వారా.. అంతర్జాతీయ అనుసంధానాన్ని కళా వినిమయాన్నీ వేవ్స్ బలోపేతం చేయగలదని ఆయన స్పష్టం చేశారు.

భారతదేశ కథన రంగంతో భాగస్వామ్యం వల్ల.. తమ సొంత సంస్కృతి బలీయంగా ప్రతిధ్వనించే కథనాలను సృష్టించవచ్చని ధీమా వ్యక్తంచేస్తూ.. అంతర్జాతీయ సృజన సమాజానికి ప్రధానమంత్రి ఆహ్వానం పలికారు. సుసంపన్నమైన భారత కథన సంప్రదాయంలో సరిహద్దులకు అతీతమైన ఇతివృత్తాలు, భావోద్వేగాలు ఉన్నాయనీ.. అవి సహజంగా, అర్థవంతంగా ఆకట్టుకోగలవని ఆయన స్పష్టం చేశారు. భారతీయ కథలను పరిశీలించే అంతర్జాతీయ కళాకారులు, సృజనకారులు ఈ దేశ వారసత్వంతో సహజమైన బంధాన్ని అనుభూతి చెందుతారని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సాంస్కృతిక సమ్మేళనం 'క్రియేట్ ఇన్ ఇండియా' అన్న భారతదేశ లక్ష్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్తుందని, దానిని ప్రపంచానికి మరింత అందుబాటులోకి తెస్తుందని పేర్కొన్నారు.

"భారత్‌లో సృజనరంగ ఆర్థిక వ్యవస్థకు ఇది తొలిపొద్దు. కంటెంట్, సృజనాత్మకత, సంస్కృతి – ఈ మూడూ దానికి మూలాధారమైన కీలక స్తంభాలు" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. భారతీయ సినిమాలు ఇప్పుడు వందకుపైగా దేశాల ప్రేక్షకులను చేరాయని, పైపై ప్రశంసలే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు భారతీయ సినిమాను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అంతర్జాతీయ ప్రేక్షకులు భారతీయ కంటెంటును సబ్‌టైటిల్స్‌తో చూసే ధోరణి పెరుగుతోందని, భారతీయ కథల్లో వారు లోతుగా నిమగ్నమవడాన్ని ఇది సూచిస్తుందని అన్నారు. భారతీయ ఓటీటీ పరిశ్రమ ఇటీవలి సంవత్సరాల్లో పది రెట్ల వృద్ధిని సాధించిందన్న శ్రీ మోదీ.. స్క్రీన్ పరిమాణం తగ్గినా కంటెంట్ పరిధి అవధులను అధిగమించి విస్తరించిందని, చిన్న స్క్రీన్లే పెద్ద సందేశాలను అందిస్తున్నాయని కూడా వ్యాఖ్యానించారు. భారతీయ వంటకాలకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరుగుతోందని, త్వరలోనే భారతీయ సంగీతం అదేవిధమైన గుర్తింపును సొంతం చేసుకుంటుందని దీమా వ్యక్తం చేశారు.భారత సృజన రంగ ఆర్థిక వ్యవస్థకు గల అపారమైన సామర్థ్యాన్ని ప్రస్తావిస్తూ... మున్ముందు సంవత్స రాల్లో దేశ జీడీపీలో దీని వాటా గణనీయంగా పెరగబోతోందని ప్రధాన మంత్రి పేర్కొన్నారు.

# రాబోయే కాలంలో వేవ్స్ స్ఫూర్తిగా భారత సాఫ్ట్ పవర్ ముందడుగు వేసేందుకు సిద్ధమైంది: కరణ్ జోహార్

న్యూఢిల్లీ, మే 2:వినోద రంగాన్ని మరింత బలోపేతం చేసే సామర్థ్యంతో వేవ్ సమ్మిట్‌ను రూపొందించి, ఈ రంగంలోని అన్ని విభాగాలను ఒకచోట చేర్చిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీకి ప్రముఖ నటుడు, చిత్రనిర్మాత షారుఖ్ ఖాన్ చిత్ర పరిశ్రమ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేదిక వినోద రంగానికి ఎంతో సందర్భోచితమైనదనీ, అలాగే ఇది వివిధ రంగాల్లో ప్రభుత్వం నుంచి అత్యంత అవసరమైనఅనుసంధానతనీ, మద్దతును అందిస్తుందని ఆయన పేర్కొన్నారు.

ఫిల్మ్–షూటింగ్ గమ్యస్థానంగా భారత్ కలిగి ఉన్న అపారమైన అవకాశాల గురించిఆయన మాట్లాడారు. 'భారతదేశంలో అంతర్జాతీయ చిత్ర నిర్మాతలు సినిమా చేయడానికి తదుపరి గమ్యస్థానంగా భారత్‌కున్న అర్హతలను షారూఖ్ ఖాన్ పంచుకున్నారు. భారత వినోద రంగ రూపకల్పనలో, దానిని బలోపేతం చేయడంలో అంతర్జాతీయ చలనచిత్ర సంస్థలు, పరిశ్రమలతో చేసుకున్న వివిధ రకాల ఒప్పందాల ఫలితాలను ఆయన ప్రధానంగా ప్రస్తావించారు.

ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల ప్రేక్షకులకు భారతీయ సినిమాను మరింతచౌకగా అందించాల్సిన అవసరముందని షారూఖ్ ఖాన్ పేర్కొన్నారు. ఈ నగరాలకు సింగిల్–స్క్రీన్ సినిమా అనుభవాన్ని తీసుకురావాలని అభిప్రాయపడిన ఆయన, దానివల్ల సినిమాలు ఎక్కువ మంది ప్రేక్షకులకు చేరువ కాగలవని తెలిపారు.

నటి దీపికా పదుకొనే మాట్లాడుతూ... వేవ్స్ ప్రాముఖ్యత గురించి తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. మీడియా–వినోద రంగాల్లోని వివిధ మాధ్యమాలను సరైన సమయంలో వేవ్స్ ఏకం చేసిందన్నారు. ఈ రంగంలోని వివిధ విభాగాలు కలిసి పనిచేయడం అరుదనీ, అయితే వేవ్స్ విస్తృత పరిధిని కలిగి ఉన్నందున సినిమాలు, ఓటీటీ, యానిమేషన్, ఏఐ, ఇతర ఆసక్తికరమైన సాంకేతికతలను సమష్టిగా రూపొందించే అవకాశం లభిస్తుందన్నారు.

వేవ్ సమ్మిట్ మొదటి రోజు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 'ది జర్నీ: ఫ్రమ్ అవుట్ సైడర్ టు రూలర్' కార్యక్రమంలో చిత్ర నిర్మాత కరణ్ జోహార్‌తో నటులు షారూఖ్ ఖాన్, దీపికా పదుకొనేలు ఆసక్తికరమైనచర్చ నిర్వహించారు.

చిత్ర పరిశ్రమలో వారి ప్రయాణం గురించీ, అలాగే వారు తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్న విధానం గురించి తమ భావాలను పంచుకున్నా రు. 'ఔట్‌సైడర్–ఇన్‌సైడర్' ట్యాగ్‌లపై తన అభిప్రాయాలను పంచుకున్న షారుఖ్ ఖాన్, కష్టపడి పనిచేయడం, పట్టుదలకు ప్రత్యామ్నాయం లేని రంగంగా సినిమా పరిశ్రమను వరిగణించాలని యువతకు పిలుపునిచ్చారు.

నేటి సోషల్ మీడియా, ఇమేజ్ మేనేజ్‌మెంట్ యుగంలో వినోద రంగంలో వస్తున్న మార్పులను గురించి మాట్లాడుతూ, ఈ రంగంలోకి కొత్తగా వచ్చే వారు... ఇమేజ్ కంటే వారి నైపుణ్యాలపైనే దృష్టి పెట్టాలని షారూఖ్ ఖాన్ సూచించారు. ప్రతి ఒక్కరూ వారి ప్రత్యేక బలాలు, సామర్థ్యాల ద్వారా స్వయంగా తమకంటూ ఒక గుర్తింపును తెచ్చుకునే సమయం ఆసన్నమైందని పదుకొనే అన్నారు.

కార్యక్రమం ముగింపు సందర్భంగా ప్రముఖ చిత్ర నిర్మాత కరణ్ జోహార్ మాట్లాడుతూ భారత్‌ను సాఫ్ట్ పవర్‌గా అభివర్ణించారు. వేవ్స్ కారణంగా రాబోయే కాలంలో ఈ సాఫ్ట్ పవర్ మరింత ముందడుగు వేసేందుకు సిద్ధమైందన్నారు.

# అంతర్జాతీయ మంత్రుల స్థాయి భాగస్వామ్యంతో వేవ్స్ 2025కు కేంద్ర బిందువు కానున్న ప్రపంచ మీడియా చర్చా వేదిక

న్యూఢిల్లీ, మే 2:ముంబయిలో జరుగుతున్న వేవ్స్ సదస్సులో భాగంగా రేపు ప్రపంచ మీడియా చర్చా వేదికను (జిఎండి)ను భారత్ మొదటిసారిగా నిర్వహిస్తోంది. ఇది ప్రపంచ మీడియా, వినోద రంగాలతో భారత్ అనుసంధానం కావడంలో ఒక ముఖ్యమైన అధ్యాయాన్ని సూచిస్తుంది. ఈ చర్చా వేదికను విదేశాంగ మంత్రిత్వ శాఖ సహకారంతో సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నిర్వహిస్తోంది.

ఆసియా, యూరప్, ఆఫ్రికా, అమెరికా నుంచి ప్రతినిధులతో పాటు 60కి పైగా దేశాలు ఈ సదస్సులో పాల్గొనే అవకాశం ఉంది. రష్యా, జపాన్, యూకే, ఈజిప్ట్, సౌదీ అరేబియా సహా పలు దేశాల మంత్రిత్వ స్థాయి, సీనియర్ అధికార స్థాయి ప్రతినిధులు ఇందులో పాల్గొంటారు. అంతర్జాతీయ సహకారాన్ని ప్రోత్సహించడం, ఉత్తమ విధానాలను పంచుకోవడం, ప్రపంచ మీడియా రంగంలో విధాన సమన్వయం, ప్రతిభ మార్పిడి, సామర్థ్యవృద్ధికి అవకాశాలను అన్వేషించడం ఈ చర్చా వేదిక లక్ష్యం.

ఈ చర్చా వేదిక ఫలితంగా 'వేవ్స్ డిక్లరేషన్' రూపుదిద్దుకోనుంది. ఇందులో పాల్గొంటున్న దేశాలు మీడియా, వినోద రంగాలలో అంతర్జాతీయ సహకారం ప్రాముఖ్యతను పునరుద్ఘాటించడంతో పాటు, భవిష్యత్ సహకారాలు, భాగస్వామ్యాలకు పునాది వేయనున్నాయి. చైతన్యవంతమైన మీడియా వ్యవస్థ, వేగంగా అభివృద్ధి చెందుతున్న వినోద పరిశ్రమతో, భారతదేశం ఇలాంటి ఒక అంతర్జాతీయ సదస్సుకు ఆతిథ్యమివ్వడానికి ప్రత్యేక అర్హత కలిగిన దేశంగా నిలిచింది. ఈ ప్రపంచ మీడియా సదస్సు ప్రపంచాన్ని విలువలతో మలచడంలో మీడియా పాత్రపై జరుగుతున్న అంతర్జాతీయ చర్చలకు భారతదేశాన్ని కేంద్ర బిందువుగా నిలబెట్టే ఒక కీలక క్షణాన్ని సూచిస్తోంది.

సమాజాలు, ఆర్థిక వ్యవస్థలు అంతర్జాతీయ సహకారాన్ని రూపొందించడంలో పెరుగుతున్న మీడియా, వినోద రంగాల పాత్ర గురించి చర్చించడానికి గ్లోబల్ మీడియా డైలాగ్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రధాన వాటాదారులను ఏకతాటిపైకి తెస్తుంది. ఇది మీడియా, వినోద రంగాలలో వేగంగా మారుతున్న దృశ్యాలను గురించి స్వేచ్ఛాయుత చర్చలకు వేదికగా నిలవనుంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానం, కంటెంట్ ధోరణులలో మార్పు, పెరుగుతున్న అంతర్జాతీయ అనుసంధానత నేపథ్యంలో, ఈ చర్చల ద్వారా సమాజాలను తీర్చిదిద్దడంలో ఆవిష్కరణకు ప్రేరణనివ్వడం, అంతర్జాతీయ సహకారాన్ని ప్రోత్సహించడం, అనుభవాలు, అభిప్రాయాలు, దృక్పథాలను పరస్పరం పంచుకునే అవకాశాన్ని కల్పించడంలో మీడియా పాత్రపై చర్చిస్తారు.

ఇందులో భాగంగా బ్రిటన్, రష్యా, ఇండోనేషియా, కెన్యా, భూటాన్, ఈజిప్ట్ సహా 10 దేశాలతో పాటు ప్రపంచ మేధో సంపత్తి సంస్థ (డబ్ల్యూఐపీవో) వంటి అంతర్జాతీయ సంస్థలతో భారత్ ద్వైపాక్షిక సమావేశాలు కూడా నిర్వహిస్తోంది. ప్రపంచ సహకారాన్ని బలోపేతం చేయడం, పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన కీలక రంగాల్లో భాగస్వామ్యాన్ని పెంపొందించడంలో భారత్ నిబద్ధతను ఈ కార్యకలాపాలు ప్రతిబింబిస్తాయి.

ఈ కార్యక్రమానికి గౌరవ విదేశీ వ్యవహారాల మంత్రి డాక్టర్ ఎస్ జైశంకర్, గౌరవ రైల్వే, సమాచార, ప్రసార, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి శ్రీ అశ్వనీ వైష్ణవ్, సమాచార, ప్రసార, పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ సహా సీనియర్ భారతీయ నాయకులు హాజరవుతారు. ఉన్నత స్థాయి ప్రముఖులు పాల్గొనడం బలమైన, సమ్మిళిత, ముందుచూపు కలిగిన ప్రపంచ మీడియా వాతావరణాన్ని పెంపొందించడానికి భారత్ నిబద్ధతను తెలియచేస్తోంది.

# కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే బొజ్జు పటేల్



ఆదిలాబాద్, మే 2: అటవీ అధికారులు కేసులు పెడతామని భయపెడితే భయపడకండి, తాను మీ వెంట ఉంటానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని 39మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తూ సబ్బండ వర్గాల ప్రజలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. పేదింటి ఆడపడుచులకు కళ్యాణ లక్ష్మీ పథకం ఆర్థికంగా ఎంతో తోడ్పాటును అందిస్తుందని తెలిపారు. మహిళల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు.వేసవి ఎండలు తీవ్రంగా ఉన్నాయని, ప్రజలు జాగ్రత్తలు తీసుకొని తీవ్ర ఎండలకు బయట తిరగొద్దని ఆయన కోరారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎంపీడీవో రాంప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ అమృత్ లాల్, పుత్తూరు ఎంపీ ఓ సుధీర్ రెడ్డి, ఆదిలాబాద్ ఆర్టీఏ సభ్యులు దూటరాజేశ్వర్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ లింగంపల్లి చంద్రయ్య, కాంగ్రెస్ పార్టీ ఉటూరు మండల అధ్యక్షులు అబ్దుల్ ఖయ్యూం, కాంగ్రెస్ నాయకులు మర్సకోళ తిరుపతి, నిసార్, కొత్తపెల్లి మహేందర్ రాజేష్ జాదవ్, ప్రభాకర్, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# చర్లపల్లి - కాజీపేట- తిరుపతి రైళ్లు రద్దు

**-ఈ నెల 30 వరకు సర్వీస్ లు బంద్**

**-ట్రాక్ మరమ్మతులు కారణంగా దక్షిణ మధ్య రైల్వే**

**-నేటి నుంచి చర్లపల్లి నుంచి కాకినాడ,నర్సాపూర్ లకు స్పెషల్ ట్రైన్స్ ..**

హైదరాబాద్, మే 2:నిర్వహణ పనుల కారణంగా చర్లపల్లి–తిరుపతి, కాజీపేట–తిరుపతి మధ్య నడిచే రైళ్లను దక్షిణ మధ్య రైల్వే రద్దు చేసింది. చర్లపల్లి–తిరుపతి రైలు ఈ నెల 8 నుంచి 29 వరకు, తిరుపతి–చర్లపల్లి (07258) రైలు మే 9 నుంచి 30 వరకు అందుబాటులో ఉండదని అధికారులు తెలిపారు. అదేవిధంగా కాజీపేట–తిరుపతి (07253) రైలు ఈ నెల 6 నుంచి 25 వరకు, తిరుపతి–కాజీపేట (07254) రైలు ఈ నెల 7 నుంచి 25 వరకు రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు.

శుక్రవారం సాయంత్రం నుంచి ఇక చర్లపల్లి నుంచి కాకినాడ, నర్సాపూర్ మధ్య 36 ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నట్లు ఎస్‌సీఆర్ వెల్లడించింది.

చర్లపల్లి–కాకికినాడ టౌన్ (07031) ప్రత్యేక రైలు మే 2 నుంచి జూన్ 27 వరకు ప్రతి శుక్రవారం రాత్రి 7.20 గంటలకు చర్లపల్లిలో బయలుదేరుతుందని, మరుసటి రోజు ఉదయం 4.30 గంటలకు కాకినాడ టౌన్ చేరుకుంటుంది. తిరుగుప్రయాణంలో ఈ రైలు (07032) మే 4 నుంచి జూన్ 29 వరకు ప్రతి ఆదివారం సాయంత్రం 6.55 గంటలకు కాకినాడ టౌన్‌లో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 6.50 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. రెండు మార్గాల్లో ఈ రైలు నల్లగొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లి గూడెం, రాజమంత్రి, సామర్లకోట స్టేషన్లలో ఆగుతుందని అధికారులు తెలిపారు. చర్లపల్లి–నర్సాపూర్ ప్రత్యేక రైలు (07233) మే 2 నుంచి జూన్ 27 వరకు ప్రతి శుక్రవారం రాత్రి 7.15 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 5.50 గంటలకు నర్సాపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07234) మే 4 నుంచి జూన్ 29 వరకు ప్రతి ఆదివారం రాత్రి 8 గంటలకు నర్సాపూర్‌లో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 8 గంటలకు చర్లపల్లి చేరుతుంది. రెండు మార్గాల్లో రైలు నల్లగొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, వీరవాసరం, పాలకొల్లు స్టేషన్లలో ఆగుతుందని చెప్పారు.

# 250 ఎల్ఎంటీలు దాటిన గోధుమల సేకరణ 2025-26 రబీ మార్కెట్ సీజన్లో 21.03 లక్షల మంది రైతులకు దక్కిన కనీస మద్దతు ధర మొత్తం రూ.62,155.96 కోట్లు

న్యూఢిల్లీ, మే 2:2025-26 రబీ మార్కెట్ కాలానికి (ఆర్ఎంఎస్) సంబంధించిన గోధుమల సేకరణ దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో సజావుగా కొనసాగుతోంది. ఈ సీజన్లో 312 ఎల్ఎంటీల గోధుమలు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు సెంట్రల్ పూల్లో 256.31 ఎల్ఎంటీలను సేకరించారు. ఏప్రిల్ 30 నాటికి సేకరించిన గోధుమల పరిమాణం, గతేడాది ఇదే సమయానికి సేకరించిన 205.41 ఎల్ఎంటీలను అధిగమించి 24.78 శాతం వృద్ధిని నమోదు చేసింది. గోధుమలను ఎక్కువగా పండించే అయిదు ప్రధాన రాష్ట్రాలైన పంజాబ్, హర్యానా, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం ఎక్కువ గోధుమలను సేకరించాయి.

ఆర్ఎంఎస్ 2025-26 నాటికి 21.03 లక్షల మంది రైతులు కనీస మద్దతు ధర లబ్ధిని పొందారు. వారికి అందించిన కనీస మద్దతు ధర విలువ రూ. 62,155.96 కోట్లు. గోధుమలను పండించే అయిదు ప్రధాన రాష్ట్రాలైన పంజాబ్, హర్యాణా, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్ నుంచి వరుసగా 103.89 ఎల్ఎంటీ, 65.67 ఎల్ఎంటీ, 67.57 ఎల్ఎంటీ, 11.44 ఎల్ఎంటీ, 7.55 ఎల్ఎంటీ గోధుమలను సేకరించారు.

ఆర్ఎంఎస్ 2025-26 కాలానికి ఇంకా గడువు మిగిలి ఉండటంతో గతేడాది కంటే ఎక్కువ మొత్తంలో గోధుమలను సేకరించేందుకు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

ఆహారం, ప్రజా పంపిణీ విభాగం చేపట్టిన పటిష్టమైన ప్రయత్నాల కారణంగా ఈ ఏడాది గోధుమల సేకరణలో సానుకూల పెరుగుదల కనిపిస్తోంది. మునుపటి సంవత్సరాల అనుభవాల ఆధారంగా రాష్ట్ర నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి, ముందుగానే రాష్ట్రాలకు అందజేశారు. రైతుల్లో అవగాహన కల్పించడం, రైతుల రిజిస్ట్రేషన్, సేకరణ కేంద్రాలను సిద్ధం చేయడం, రైతులకు కనీస మద్దతు ధరను సకాలంలో అందించడం తదితర కార్యక్రమాలను ఆయా రాష్ట్రాల్లో క్రమం తప్పకుండా ఏర్పాటు చేశారు. అలాగే ఏవైనా సమస్యలు ఎదురైతే వాటిని పరిష్కరించేందుకు తరచూ సమీక్షలు నిర్వహించారు. చాలా సందర్భాల్లో రైతులకు 24 నుంచి 48 గంటల లోపే కనీస మద్దతు ధర అందింది.

స్టాక్ పోర్టల్ ద్వారా నిల్వ పరిమితులను తప్పనిసరి చేయడం, ఎఫ్ఏక్యూ నిబంధనల సడలింపునకు సకాలంలో ఆమోదం, అవసరమైన సందర్భాల్లో చర్యలు తీసుకోవడానికి గుర్తించిన జిల్లాల్లో అధికారుల క్షేత్రస్థాయి సందర్శన తదితర చర్యలను ఆహార, ప్రజా పంపిణీ విభాగం చేపట్టింది.

# కృష్ణా నదిపై అందుబాటులోకి వచ్చిన కొత్త వారధి .. సులభంగా అమరావతి చేరుకునే అవకాశం



అమరావతి, మే 2: రాజధాని అమరావతికి ప్రయాణించేవారికి శుభవార్త. ఇకపై విజయవాడ నగరంలోకి ప్రవేశించి, గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోవాల్సిన అవసరం లేదు. కృష్ణా నదిపై నిర్మించిన 3.11 కిలోమీటర్ల పొడవైన ఆరు వరుసల భారీ వంతెన అందుబాటులోకి వచ్చింది. ఈ కొత్త వారధి ద్వారా విజయవాడ నగరంలోకి ప్రవేశించకుండా, అతి తక్కువ సమయంలో నేరుగా అమరావతికి చేరుకోవచ్చు.

ప్రధానమంత్రి పర్యటన, అమరావతి నిర్మాణ పనుల పునఃప్రారంభం నేపథ్యంలో ఈ వంతెనను అధికారులు ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. పశ్చిమ బైపాస్‌లో భాగంగా నిర్మించిన ఈ బ్రిడ్జి, అమరావతికి అత్యంత వేగవంతమైన అనుసంధానతను అందిస్తుంది. హైదరాబాద్ వైపు నుంచి వచ్చేవారు గొల్లపూడి వద్ద ఈ వంతెన ఎక్కితే కేవలం ఐదు నిమిషాల్లోనే కృష్ణా నదిని దాటి అమరావతిలోని వెంకటపాలెం చేరుకోవచ్చు. అదేవిధంగా, ఉభయ గోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చేవారు గన్నవరం సమీపంలోని చిన్న అవుటపల్లి వద్ద బైపాస్ ఎక్కి, విజయవాడ ట్రాఫిక్‌తో సంబంధం లేకుండా అరగంటలోపే అమరావతిలోకి ప్రవేశించే వీలు కలిగింది.

ఈ వంతెన నిర్మాణం వల్ల ప్రయాణ సమయం గణనీయంగా ఆదా అవ్వడంతో పాటు, అమరావతి నిర్మాణ పనులకు అవసరమైన భారీ వాహనాలు, నిర్మాణ సామగ్రి రవాణా కూడా సులభతరం కానుంది. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా, వేగంగా, సురక్షితంగా ప్రయాణించేందుకు వీలుగా ఇరువైపులా వేర్వేరు మార్గాలు, సూచికలు, డివైడర్లు, లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఈ కొత్త మార్గం అమరావతి అభివృద్ధికి దోహదపడుతుందని, ప్రయాణికులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని స్థానికులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాజధానిలోని సచివాలయం, హైకోర్టు, ఇతర కార్యాలయాలకు వెళ్లే వారికి ఈ వంతెన ఓ వరంలా మారనుంది.

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొనే బహిరంగ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి ప్రజలు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. రాజధాని నిర్మాణ పనుల పునఃప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వస్తున్న జనంతో విజయవాడ పశ్చిమ బైపాస్ మార్గం కిటకిటలాడుతోంది. ముఖ్యంగా ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు బస్సులు, కార్లలో సభా స్థలికి చేరుకుంటున్నారు.

కృష్ణా జిల్లా చిన్నవుటపల్లి నుంచి రాజధాని గ్రామాలను కలిపేలా నిర్మించిన విజయవాడ వెస్ట్ బైపాస్, సుదూర ప్రాంతాల నుంచి అమరావతికి వచ్చే ప్రజలకు ప్రధాన మార్గంగా మారింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, మన్యం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల నుంచి ప్రజలు ప్రత్యేక వాహనాల్లో తరలివస్తున్న దృశ్యాలు కనిపించాయి. ఐదేళ్ల విరామం తర్వాత రాజధాని పనులు మళ్లీ ప్రారంభం కావడం పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా అధికారులు వెస్ట్ బైపాస్‌పై ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న వారికి తాగునీటి ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లను అందజేస్తూ సహాయక చర్యలు చేపట్టారు. లక్షలాది మంది ప్రజలు ఈ మార్గం గుండా ప్రయాణించే అవకాశం ఉండటంతో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస నియోజకవర్గం నుంచి వచ్చిన పలువురు మాట్లాడుతూ, అమరావతి పనులు తిరిగి ప్రారంభం కావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. "మా నాయకుడు చంద్రబాబు పిలుపు మేరకు, ప్రధాని మోదీ గారికి స్వాగతం పలకడానికి, అమరావతి నిర్మాణానికి మద్దతు తెలియజేయడానికి వచ్చాం. రాష్ట్రానికి ఒక రాజధాని ఉండటం అత్యవసరం. ఈ ప్రభుత్వ హయాంలో, కేంద్ర సహకారంతో అమరావతి నిర్మాణం పూర్తవుతుందని నమ్మకం ఉంది," అని వారు అభిప్రాయపడ్డారు. గత ఐదేళ్లలో రాజధాని విషయంలో అనిశ్చితి నెలకొందని, ఇప్పుడు స్పష్టత రావడంతో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

గతంలో ప్రధాని మోదీ చేతుల మీదుగా శంకుస్థాపన జరుపుకున్న అమరావతి పనులు, మళ్లీ ఆయన సమక్షంలోనే పునఃప్రారంభం కానుండటంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఐదేళ్లలో రాజధాని నిర్మాణం పూర్తి చేసి, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అని గర్వంగా చెప్పుకునే రోజులు వస్తాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. వేలాది వాహనాలతో విజయవాడ వెస్ట్ బైపాస్ ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది. అమరావతికి తరలివస్తున్న జన ప్రవాహం కొనసాగుతూనే ఉంది.

## భారత్‌కు అమెరికా సంఘీభావంగా నిలుస్తుంది... స్వీయ రక్షణపై భారత్ హక్కులకు అండగా ఉంటుంది: శ్రీ పీట్ హెగ్సేత్

న్యూఢిల్లీ, మే 2:అమెరికా రక్షణ కార్యదర్శి శ్రీ పీట్ హెగ్సేత్ మే 1న భారత రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఇటీవల ఉగ్రవాదుల దాడిలో అమాయక పౌరుల మరణంపట్ల సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు. ఉగ్రవాద సంస్థలకు మద్దతు, శిక్షణ ఇవ్వడంతోపాటు నిధులు సమకూర్చే చరిత్ర పాకిస్తాన్‌కు ఉందని భారత రక్షణ మంత్రి అమెరికా రక్షణ కార్యదర్శికి ఈ సందర్భంగా చెప్పారు.

"పాకిస్తాన్ హింసను ప్రేరేపించే దేశంగా రుజువైంది. అంతర్జాతీయ తీవ్రవాదాన్ని ఎగదోస్తూ ఈ ప్రాంతాన్ని అస్థిరపరుస్తోంది. ప్రపంచం ఇకపై ఉగ్రవాదాన్ని ఉపేక్షించకూడదు" అని రక్షణ మంత్రి అన్నారు. ఈ హేయమైన ఉగ్రవాద చర్యలను అంతర్జాతీయ సమాజం నిర్ద్వంద్వంగా, నిస్సంకోచంగా ఖండించాల్సిన, నిరసించాల్సిన ఆవశ్యకత ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

ఉగ్రవాదంపై పోరాటంలో అమెరికా ప్రభుత్వ పూర్తి మద్దతు భారత్‌కు ఉంటుందని ఆ దేశ రక్షణ కార్యదర్శి పునరుద్ఘాటించారు. భారత్‌కు అమెరికా సంఘీభావంగా నిలుస్తుందని, స్వీయ రక్షణపై భారత్ హక్కులకు అండగా ఉంటుందని తెలిపారు.

## ఆర్థిక శాఖలో రెవెన్యూ విభాగం కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన శ్రీ అరవింద్ శ్రీవాస్తవ

న్యూఢిల్లీ, మే 2:శ్రీ అరవింద్ శ్రీవాస్తవ ఆర్థిక శాఖలో రెవెన్యూ విభాగం కార్యదర్శిగా ఈ రోజు పదవీబాధ్యతలు స్వీకరించారు. మంత్రివర్గ నియామకాల కమిటీ శ్రీ శ్రీవాస్తవను రెవెన్యూ విభాగం కార్యదర్శిగా గత నెల 18న నియమించింది.

1994 ఐఏఎస్ బ్యాచ్ కు చెందిన కర్నాటక కేడర్ అధికారి శ్రీ శ్రీవాస్తవ... ఇంతకు ముందు ప్రధానమంత్రి కార్యాలయంలో సంయుక్త కార్యదర్శిగా, అదనపు కార్యదర్శిగా కూడా పనిచేశారు.

అంతక్రితం, ఈ కింద పేర్కొన్న పదవులలోనూ శ్రీ శ్రీవాస్తవ తన సేవలను ప్రజలకు అందించారు:

ఆర్థిక శాఖలో ఆర్థిక వ్యవహారాల విభాగం పరిధిలోని బడ్జెట్ డివిజనుకు సంయుక్త కార్యదర్శి, ఆసియా అభివృద్ధి బ్యాంకులో డెవలప్‌మెంట్ ఆఫీసరు, ఆర్థిక విభాగం- బెంగళూరులో కార్యదర్శి, పట్టణాభివృద్ధి విభాగం- బెంగళూరులో కార్యదర్శి, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కార్పొరేషన్- కర్నాటకలో మేనేజింగ్ డైరెక్టరు.

# ఈశాన్య భారత్‌లోని 8 రాష్ట్రాలను కలుపుకొంటూ ఈ ప్రాంతాన్ని దేశాభివృద్ధిలో కీలకంగా మార్చడమే లక్ష్యం: కేంద్ర మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య ఎం. సింధియా

న్యూఢిల్లీ, మే 2:ఈశాన్య ప్రాంతంలో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు పారిశ్రామిక దిగ్గజాలతో కేంద్ర కమ్యూనికేషన్లు, ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య ఎం. సింధియా అధ్యక్షతన సమావేశం జరిగింది.

పారిశ్రామిక దిగ్గజాలైన ముఖేశ్ అంబానీ (రిలయన్స్ ఇండస్ట్రీస్), కుమార్ మంగళం బిర్లా (ఆదిత్య బిర్లా గ్రూప్), ఎన్.చంద్రశేఖరన్ (టాటా సన్స్)తో ముంబయిలో వరుస సమావేశాలను కేంద్ర మంత్రి నిర్వహించారు. ఇవి బుధవారం (2025, ఏప్రిల్ 30) జరిగాయి. ఈ సమావేశాలను మే నెల 23, 24 తేదీల్లో ఢిల్లీలో జరగనున్న "రైజింగ్ నార్త్ఈస్ట్ సమ్మిట్ 2025" పెట్టుబడుల సదస్సులో భాగంగా నిర్వహించారు.

దేశాభివృద్ధికి సరికొత్త ఇంజినుగా ఈశాన్య ప్రాంతాన్ని తీర్చిదిద్దాలన్న భారత ప్రభుత్వ వ్యూహాత్మక లక్ష్యాన్ని కేంద్ర మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య సింధియా స్పష్టం చేశారు. "ఈ ఎనిమిది రాష్ట్రాలను ఏకం చేసి భారత వృద్ధిలో కీలకంగా మార్చడమే లక్ష్యం" అని తెలిపారు. ఈ ప్రాంతంలో వేగంగా సుస్థిరాభివృద్ధిని సాధించడానికి ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యాలు పోషించే పాత్రను ఆయన వివరించారు.

ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో చేస్తున్న కార్యక్రమాలను పారిశ్రామికవేత్తలతో మంత్రి చర్చించారు. ఎనిమిది ఈశాన్య రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కలసి ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి టాస్క్ ఫోర్స్, ప్రతి రాష్ట్రంలోనూ పెట్టుబడుల ప్రోత్సాహక ఏజెన్సీ (ఐసీఏ)ల ఏర్పాటుతో సహా ఇతర ముఖ్యమైన కార్యక్రమాల గురించి వివరించారు.

ఈశాన్య ప్రాంతంలోని ఎనిమిది రాష్ట్రాల్లో ఉన్న కీలకమైన పెట్టుబడుల అవకాశాల గురించి ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి మంత్రిత్వ శాఖ గణాంక సలహాదారు శ్రీ ధర్మవీర్ ఝా వివరించారు.

ఈ ప్రాంతానికి సంబంధించి వృద్ధి సాధించేందుకు అవకాశమున్న వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, జౌళి, పర్యాటక రంగాల గురించి ప్రధానంగా చర్చలు కొనసాగాయి.

ఈ ప్రాంతంలోని ఆర్థిక సామర్థ్యాన్ని వెలికి తీసేందుకు సంబంధిత వర్గాలు, పెట్టుబడిదారులు, విధాన రూపకర్తలను రైజింగ్ నార్త్ ఈస్ట్ సమ్మిట్ 2025 ఒక వేదిక మీదకు తీసుకొస్తుంది. ఢిల్లీలోని భారత్ మండపంలో మే 23, 24 తేదీల్లో ఈ సదస్సు జరుగుతుంది.

# క్రియేటివ్ కంటెంట్ రంగంలో ప్రపంచానికి భారత్ నాయకత్వం వహించే వేదికగా వేవ్స్ మారుతుందని విశ్వసిస్తున్నా: అల్లు అర్జున్

న్యూఢిల్లీ, మే 2:ముంబయిలోని జియో వరల్డ్ సెంటర్లో జరుగుతున్న ప్రపంచ ఆడియో విజువల్ ఎంటర్టైన్మెంట్ సదస్సు (వేవ్స్) 2025కి ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ గురువారం హాజరయ్యారు. దీంతో కలల నగరం మరింత ప్రకాశవంతమైంది. అందరూ ఆసక్తిగా ఎదురు చూసిన 'టాలెంట్ బియాండ్ బోర్డర్స్' పేరుతో నిర్వహించిన చర్చా కార్యక్రమానికి టీవీ9 నెట్‌వర్క్ ఎండీ, సీఈవో బరుణ్ దాస్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కీర్తి, మనుగడ, స్ఫూర్తి అంశాల్లో మనసుల్ని హత్తుకున్న మాస్టర్‌క్లాస్‌గా ఈ కార్యక్రమం నిలిచింది.

కథ చెప్పే రంగంలో అంతర్జాతీయంగా పెరుగుతున్న భారత్ ప్రాధాన్యాన్ని చాటి చెప్పే వేదికగా ఈ సదస్సును అల్లు అర్జున్ ప్రశంసించారు. "భారత్ ఎల్లప్పుడూ స్ఫూర్తిని కనబరుస్తూనే ఉంది. దాన్ని ప్రదర్శించే వేదిక కూడా ఇప్పుడు మనకు ఉంది" అని అన్నారు. "క్రియేటివ్ కంటెంట్ రంగంలో ప్రపంచానికి భారత్ నాయకత్వం వహించే వేదికగా వేవ్స్ మారుతుందని విశ్వసిస్తున్నాను" అని పేర్కొన్నారు.

ఆరు నెలల పాటు తనను విశ్రాంతికే పరిమితం చేసిన ప్రమాదం గురించి పుష్ప నటుడు మాట్లాడుతున్నప్పుడు ఈ సంభాషణ మరింత ఆసక్తికరంగా మారింది. "ఆ విరామం ఓ వరం లాంటిది" అన్నారు. "ఇది నా దృష్టిని సాహసం నుంచి వాస్తవం వైపు మళ్లించింది. శారీరక పటుత్వం తగ్గుతున్నప్పుడు, నైపుణ్యం పెంచుకోవాలని నేను గుర్తించాను. నటన నా మొదటి ప్రాధాన్యంగా మారింది"

దర్శకుడు అట్లీతో తన తదుపరి చిత్రం తెరకెక్కుతున్నట్లు అల్లు అర్జున్ ధ్రువీకరించారు. "భారతీయ భావోద్వేగాలు నిండిన చిత్రం" అని పేర్కొన్నారు. "దేశ ఆత్మతో అంతర్జాతీయ సాంకేతికతను మనం మిళితం చేస్తున్నాం -- భారత్ కోసం ఓ చిత్రం, భారత్ నుంచి ప్రపంచానికో చిత్రం" అని ఉద్వేగంతో పలికారు.

నిరంతరం అభివృద్ధి చెందే సినీ రంగంలో మనుగడ సాగించడంలో ఎదురవుతున్న సవాళ్ల గురించి కూడా చర్చించారు. "ప్రతి భాషలోఅద్భుతమైన ప్రతిభ ఉన్న యువ నటులు వస్తున్నారు. నిజాయతీగా, ఉత్సాహంగా, బహుముఖ ప్రజ్ఞ కలిగి ఉండాలి" అని సూచించారు. "ఇది కేవలం పరిశ్రమ కాదు.. సృజనాత్మకతకు, స్థిరత్వానికి, పరిణామానికి సంబంధించిన యుద్ధభూమి" అన్నారు.

తన మూలాల గురించి మాట్లాడుతున్నప్పుడు సభలో ఉన్నవారు మొత్తం ఆసక్తిగా విన్నారు. తన తాతయ్య అల్లు రామలింగయ్య, తండ్రి, నిర్మాత అల్లు అరవింద్, చిరకాలం స్ఫూర్తినిచ్చే మామయ్య చిరంజీవికి ఉద్వేగం నిండిన గొంతుతో కృతజ్ఞతలు తెలిపారు. "నేను స్వయంకృషితో ఇది సాధించలేదు" అని అంగీకరించారు. "నా చుట్టూ ఉన్నవారి మార్గదర్శకత్వం, మద్దతు, వారి గొప్పతనం వల్ల నేను ఈ స్థాయికి వచ్చాను. ఈ విషయంలో నేను అదృష్టవంతుడ్ని" అని అన్నారు.

తన బలం ఏమిటనే ప్రశ్నకు అభిమానులే అని సమాధానమిచ్చారు. "ప్రభ తగ్గినప్పుడు చప్పట్లు కూడా తగ్గిపోతాయి. నన్ను పైకి తీసుకొచ్చింది మీరే. నేనెందుకు ఇది చేస్తున్నానో గుర్తు చేసేదీ మీరే. నా బలం.. మీరే"

భారత సృజనాత్మక సాహసయాత్రలో చరిత్రాత్మకంగా నిలిచిపోనున్న వేవ్స్ 2025ను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించారు.

# ఇటు బిజెపి, అటు కాంగ్రెస్ లు అన్యాయమే చేస్తున్నాయి - హరీశ్ రావు



సంగారెడ్డి, మే 2: తెలంగాణను బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాణకు అన్యాయం తప్ప ఏం చేయలేదని మండిపడ్డారు. మరోవైపు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. బీఆర్ఎస్ ప్రారంభించిన బసవేశ్వర సంగమేశ్వర ప్రాజెక్టును రేవంత్ సర్కార్ పూర్తిగా పక్కన పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్‌కల్ మండలం రత్నాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హరీశ్‌రావు సమక్షంలో నేడు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జహీరాబాద్ నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేసిందన్నారు. సంగారెడ్డి జిల్లా అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు. సంగమేశ్వర ప్రాజెక్టు పూర్తయితే జిల్లా మొత్తం సాగు నీటితో సస్యశ్యామలం అవుతుందని చెప్పారు. బసవేశ్వర ప్రాజెక్టు పూర్తి చేయడానికి బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని వెల్లడించారు. తాగు, సాగు నీరు కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బీఆర్ఎస్ ఉన్నపుడు వచ్చిన నీళ్ళు ఇప్పుడు ఎందుకు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలనా వైఫల్యం, కాంగ్రెస్ నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారిందని చెప్పారు.

ప్రజలకు కాంగ్రెస్ మోసం తెలిసిపోయిందని, రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం అవుతుందని చెప్పారు.

## బీఆర్ఎస్ అండగా నిలిస్తే.. కాంగ్రెస్ ఆగం చేసింది.. సబితా ఇంద్రారెడ్డి ధ్వజం

హైదరాబాద్, మే 2:పేదింటి ఆడబిడ్డ పెండ్లి తల్లిదండ్రులకు భారం కావద్దని ఉద్దేశంతో దేశంలోనే మొదటిసారిగా కేసీఆర్ విప్లవాత్మక పథకానికి శ్రీకారం చుట్టారని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సరూర్‌నగర్, ఆర్కే పురం డివిజన్లకు మంజూరైన 99 కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను శుక్రవారం సరూర్‌నగర్ తహశీల్దార్ కార్యాలయం ఆవరణంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి లబ్ధిదారులకు అందజేశారు.

ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు లక్ష రూపాయలు మాత్రమే ఇస్తున్నారని, తాము అధికారంలోకొస్తే రూ. 1,00,116 లతోపాటు తులం బంగారం ఇస్తామని చెప్పి సీఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చారని తెలిపారు. కానీ అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్ రెడ్డి గత ప్రభుత్వంలో ఇచ్చిన రూ. 1,00,116 మాత్రమే ఇస్తున్నారని పేర్కొన్నారు. తులం బంగారం ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. సరూర్‌నగర్ డివిజన్‌కు చెందిన 209 మంది మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కరికీ తులం బంగారం బాకీ పడిందని చెప్పారు. అలాగే కేసీఆర్ ప్రభుత్వంలో ఒక కుటుంబంలో ఒక్కరికి మాత్రమే పెన్షన్ ఇస్తున్నారని.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అత్తామామతో పాటు కోడలికి కూడా రూ.2500 ఇస్తామని చెప్పారన్నారు. చెప్పిన మాట ప్రకారం కుటుంబంలోని అత్తామామలతో పాటు కోడలికి రూ.2500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బడ్జెట్ చూసుకోకుండా ఇష్టమొచ్చిన విధంగా అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను అమలు చేయ కుండా రాష్ట్రం అప్పుల పాలయ్యిందని, లంక బిందెలు లేవని పదే పదే చెప్పడం సిగ్గుచేటు అన్నారు. లంక బిందెలు ఉంటేనే హామీలు ఇస్తారా అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

# పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పనులు త్వరితగతిన పూర్తి చేయాలి.. నిరంజన్ రెడ్డి



హైదరాబాద్, మే 2:పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు. కృష్ణా నదిలో తెలంగాణ నదీ జలాలకు సంబంధించి న్యాయమైన వాటాకు పట్టుబట్టాలని, ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని, ధాన్యానికి బోనస్ ఇవ్వాలని కోరారు.

తెలంగాణ భవన్‌లో ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఏడాదిన్నరగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో తట్టెడు మన్ను ఎత్తని కాంగ్రెస్ ప్రభుత్వం, తమ హయాంలో 92శాతం పనులు పూర్తయిన ఈ ప్రాజెక్ట్ మరో రెండేళ్లలో పూర్తి చేస్తామని చెప్పడం దేనికి నిదర్శనమని అన్నారు.. పాలమూరు బిడ్డగా చెప్పుకునే రేవంత్ రెడ్డి పాలమూరు రంగారెడ్డి పనులను చేపట్టకపోవడం మాతృద్రోహం కాదా.. అని నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు.

### బీఆర్ఎస్ పై కక్ష్యతోనే పాలమూరు పనుల్లో నత్తనడక..

ఉద్దండపూర్‌లో కొద్దిగా మినహా మిగిలిన నాలుగు పంప్ హౌస్‌లు, రిజర్వాయర్లు, సబ్ స్టేషన్‌లు, టన్నెళ్లు, సర్జ్ పూల్స్ బీఆర్ఎస్ హయాంలోనే పూర్తి చేశామని నిరంజన్ రెడ్డి అన్నారు. నార్లాపూర్‌లో వెట్ రన్ పూర్తి అయిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ ప్యాకేజీ 3లో 8 కిలోమీటర్ల కాలువ మాత్రమే మిగిలిపోయిందని అన్నారు. ఈ ప్రాజెక్టు కోసం 27 వేల ఎకరాలకు గాను వందెకరాలు మినహా మిగిలిన భూసేకరణ చేశామన్నారు.. బిఆర్ఎస్ పై కక్షతోనే కేవలం పాలమూరు ఫలితాలు త్వరగా అందకూడదనే ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు.. ఈ ప్రాజెక్ట్ మీద సమగ్ర సమీక్ష చేయకుండా ఉద్దేశపూర్వకంగా పక్కన పెడుతున్నారు అని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు.

### వంద కోట్లతో నీళ్లందించే పథకానికి రూ.1800 కోట్ల ఖర్చా..

12.30 లక్షల ఎకరాలకు ఈ పథకం కింద సాగునీరు నల్లగొండ, పాలమూరు, రంగారెడ్డి జిల్లాలకు అందుతుంది. నల్లగొండకు డిండి లిఫ్ట్ ద్వారా దీని నుండి సాగునీరు అందుతుందన్నారు నిరంజన్ రెడ్డి. ఏదుల నుండి నీళ్లివ్వడం ఖర్చుతో కూడుకున్నది అని కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాం.. దానికి బదులు తక్కువ ఖర్చుతో వట్టెం రిజర్వాయర్ నుండి అఫ్ టెక్ ద్వారా గ్రావిటీ కింద నీళు తీసుకెళ్లవచ్చని ప్రభుత్వానికి సూచించాం. దీనికి రూ.80 నుండి రూ.100 కోట్లు మాత్రమే ఖర్చు అవుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏదుల నుండే నీళ్లు తీసుకెళ్లాలని రూ.1800 కోట్లు ఖర్చుకు సిద్ధం అవుతుంది. దీనిలో రూ.1300 కోట్లు టెండర్లు కూడా పూర్తి చేశారు. రూ.80 కోట్లతో అయ్యే పనులను రూ.1800 కోట్లు ఎందుకు ఖర్చు చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం నిపుణుల కమిటీని వేయాలని ప్రభుత్వాన్ని నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు.

### అప్పుడు జూరాల వట్టిపోవడం ఖాయం..

పాలమూరు పనులు పక్కన పెట్టి డిండి పనులను ఎందుకు హడావిడిగా చేపడుతున్నారని నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు. తక్కువ ఖర్చుతో పూర్తయ్యే దానిని నీటి పారుదల శాఖ మంత్రి ఎందుకు సమీక్షించడం లేదు..? పాలమూరు - రంగారెడ్డిలో నారాయణ పేట, కొడంగల్‌కు గ్రావిటీతో సాగునీళ్లు ఇచ్చే టెండర్లు రద్దు చేసి కొడంగల్ ఎత్తిపోతల ఎందుకు చేపట్టారు. నదీజలాల పునఃపంపిణీపై బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఉత్తర్వులను ఈ నెల 7న ఫైనల్ చేసేందుకు కేంద్రం రాష్ట్రాలతో సమావేశం ఏర్పాటు చేసింది. ఈ ఉత్తర్వులపై మేము అభ్యంతరం తెలిపాం.. ఈ నీటి వాటాలో తెలంగాణ వాటాను యధాతథంగా తెలంగాణ ప్రభుత్వం ఒప్పుకుంటే తెలంగాణకు గొడ్డలి పెట్టు. దీనిమూలంగా ఆల్మట్టి ఎత్తు పెంచి 160 టీఎంసీలు నిలుపుకునేందుకు అవకాశం ఉంటుంది. దీంతో తెలంగాణకు నీళ్లు రావడం గగనంగా మారుతుంది. ఆల్మట్టిలో 10 టీఎంసీల నీళ్లు వదులు కోవడానికి కింది రాష్ట్రాలకు అవకాశం ఇచ్చింది.. అయితే ఆల్మట్టిలో అలా పెట్టుకోవడానికి ప్రాజెక్టు డిజైన్ సరిపోదు. అప్పుడు జూరాల వట్టిపోవడం ఖాయం అని నిరంజన్ రెడ్డి తెలిపారు. ప్రాజెక్ట్‌లపై కేంద్రం ఈ నెల 7న నిర్వహించే సమావేశంలో తెలంగాణ ప్రయోజనాల కోసం పట్టుబట్టాలని కోరారు.

# వంద పాకిస్థాన్‌లు వచ్చినా మోడీ మిసైల్ ముందు మటాష్ - నారా లోకేష్



అమరావతి, మే 2:వంద పాకిస్థాన్ లు వచ్చినా, దీటుగా బదులిచ్చేందుకు మన వద్ద ఒక్క మిస్సైల్ ఉంది.. ఆ మిస్సైల్ పేరు నమో (నరేంద్ర మోదీ) అని మంత్రి లోకేశ్ అన్నారు.

అమరావతి పనుల పునః ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో లోకేశ్ మాట్లాడుతూ, "వారు భారతగడ్డపై గడ్డి మొక్క కూడా పీకలేరు. సింహం ముందు ఆటలు ఆడకూడదు.. ఆడితే ఏమవుతుంది. మన నమో దెబ్బకు వరల్డ్ మ్యాప్ నుంచి పాకిస్థాన్ మిస్సింగ్ కావడం ఖాయం. ఈరోజ పాక్ ఆర్మీలో పనిచేసేవారు కొందరు రాజీనామాలు చేశారు, కొందరు సెలవు పెట్టి వెళ్లిపోయారు. నమో కొట్టే దెబ్బకు పాకిస్థాన్ దిమ్మదిరిగిపోవడం ఖాయం. ఇవాళ యావత్ దేశం మన నమో వెంట నిలుస్తోంది అని అన్నారు.

కులగణన నిర్ణయం చారిత్రాత్మకం ..

కేంద్రం ఇవాళ కులగణన చేయాలని నిర్ణయించింది. ఇది ఒక నిర్ణయం కాదు.. ఇది ఒక సంచలనం అని అన్నారు లోకేష్. కులగణన చేయడానికి చాలామంది దశాబ్దాలుగా వెనుకాడుతుంటే, మన నమో ధైర్యంగా నిర్ణయం తీసుకున్నారు. నమోకు మన అమరావతి అంటే ఎంతో ప్రేమ. ఆయన ఢిల్లీలో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ, మన అమరావతి కోసం వచ్చారు. ఆయన ఏపీకి కావాల్సినవన్నీ అందిస్తున్నారు, కోరిన కోర్కెలు తీర్చుతున్నారు. మొన్ననే విశాఖపట్నం వచ్చి రైల్వే జోన్, ఎన్టీపీసీ, నక్కపల్లి డ్రగ్ పార్క్ కు నిధులు కేటాయించారు. ఏకంగా విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రారంభించారు. ఇప్పుడు అమరావతి వచ్చి నిధులే కాదు పనులు కూడా ప్రారంభించబోతున్నారు" అని లోకేశ్ వివరించారు

# భారత ప్రసార నియంత్రణ రంగ వృద్ధి, భవిష్యత్తు సవాళ్లను స్పష్టం చేసిన వేవ్స్ 2025

న్యూఢిల్లీ, మే 2: ముంబయిలో ఈ రోజు ప్రారంభమైన వేవ్స్ 2025 ప్రపంచ శిఖరాగ్ర సమావేశంలో భాగంగా జరిగిన బ్రేక్ అవుట్ సమావేశాల్లో మీడియా–వినోద రంగ వృద్ధిని, సమతుల్య నియంత్రణ విధానం ఆవశ్యకతను గురించి ప్రధానంగా చర్చించారు.

డిజిటల్ యుగంలో ప్రసారాన్ని నియంత్రించడం – కీలక విధానాలు, సవాళ్లు అనే అంశంపై జరిగిన బ్రేక్ అవుట్ సమావేశంలో అంతర్జాతీయ, భారత మీడియా నియంత్రణ సంస్థలకు చెందిన ప్రముఖులు వారి అభిప్రాయాలను పంచుకున్నారు. టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) ఛైర్మన్ శ్రీ అనిల్ కుమార్ లహోటి, ఆసియా–పసిఫిక్ ఇనిస్టిట్యూట్ ఫర్ బ్రాడ్‌కాస్టింగ్ డెవలప్‌మెంట్ (ఏఐబీడీ) డైరెక్టర్ శ్రీమతి ఫిలోమెనా జ్ఞానప్రగాసం, ఆసియా–పసిఫిక్ ఇనిస్టిట్యూట్ ఫర్ బ్రాడ్‌కాస్టింగ్ డెవలప్మెంట్ (ఏబీఐడి) సెక్రటరీ జనరల్ శ్రీ అహ్మద్ నదీమ్, మీడియాసెట్ అంతర్జాతీయ వ్యవహారాల డైరెక్టర్ శ్రీమతి కరోలినా లోరెంజో ప్యానెలిస్టులుగా పాల్గొన్నారు.

1995 కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్స్ (నియంత్రణ) చట్టం నుంచి కేబుల్ టీవీ డిజిటలైజేషన్ వరకు భారత నియంత్రణ పరిణామాన్ని, అలాగే వినియోగదారుల ఎంపిక.. సేవల నాణ్యతపై ప్రస్తుతం ట్రాయ్ దృష్టి సారించడంపై శ్రీ లహోటి వివరించారు. వినియోగదారుల ప్రయోజనాల విషయంలో రాజీ లేని నియంత్రణల సడలింపు ద్వారా సమాన స్థాయిని నిర్ధారించడంలో ట్రాయ్ ప్రయత్నాలను ఆయన ప్రధానంగా ప్రస్తావించారు.

వేగంగా వృద్ధి చెందుతున్న ఓవర్–ది–టాప్ (ఓటీటీ) వేదికలు, వాటి వల్ల ఎదురవుతున్న ఇబ్బందుల గురించి ప్యానెలిస్టులు చర్చించారు. 2024లో భారత డిజిటల్ మీడియా మార్కెట్ విలువ 9.7 బిలియన్ డాలర్లకు చేరుకోవడంతో, సమతుల్య నియంత్రణ ప్రాధాన్యం సంతరించు కుంది. డిజిటల్ రేడియో, సరళీకృత నెట్‌వర్క్ ఆర్కిటెక్చర్, జాతీయ ప్రసార విధానం కోసం ట్రాయ్ ప్రతిపాదనలను శ్రీ లహోటి వివరించారు.

నియంత్రణతో పాటు మీడియా చైతన్యం ప్రాముఖ్యతను శ్రీమతి జ్ఞానప్రగానం ప్రధానంగా ప్రస్తావించారు. జవాబుదారీతనాన్ని నిర్ధారిస్తూనే ఆవిష్కరణలను ప్రోత్సహించడానికిగానూ నియంత్రణ కోసం దశలవారీ విధానం అవసరమని శ్రీ నదీమ్ పేర్కొన్నారు. మీడియాసెట్‌లోని అంతర్జాతీయ వ్యవహారాల డైరెక్టర్ శ్రీమతి కరోలినా లోరెంజో మాట్లాడుతూ, వేదికల జవాబుదారీతనం విషయంలో యూరప్ అనుభవాన్ని ప్రస్తావించారు. స్మార్ట్ టీవీల వంటి సాంకేతికత క్రమంలో సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌లలో ఎదురవుతున్న నెట్‌వర్క్ ప్రభావాల సవాళ్లను వివరించారు.

వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షిస్తూ, నియంత్రణ సంక్లిష్టతను తగ్గిస్తూ సమన్వయ నియంత్రణను సాధించాల్సిన ఆవశ్యకతపై ఏకాభిప్రాయ సాధనతో సమావేశాన్ని ముగించారు.

# మీడియా-వినోదం భారత సాఫ్ట్ పవర్ మాత్రమే కాదు... ఇది భారత నిజమైన పవర్: అంబానీ

న్యూఢిల్లీ, మే 2:ఈరోజు ముంబయిలో ప్రారంభమైన మార్గదర్శక ప్రపంచ మీడియా- వినోద రంగాల శిఖరాగ్ర సమావేశం వేవ్స్ 2025లో కీలకోపన్యాసం చేస్తూ... "భారత్ కేవలం ఒక దేశం మాత్రమే కాదు. ఇది కథల నాగరికత, ఇక్కడ కథ చెప్పడం ఒక జీవన విధానం" అని రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ముఖేష్ అంబానీ అన్నారు.

ప్రఖ్యాత అమెరికన్ రచయిత మార్క్ ట్వైన్‌ను ఉటంకిస్తూ.... శ్రీ అంబానీ భారతదేశాన్ని "మానవ జాతికి పుట్టినిల్లుగా, మానవ వాక్కుకు జన్మస్థలంగా, చరిత్రకు తల్లిగా, పురాణగాథలకు అమ్మమ్మగా, సంప్రదాయాలకు ముత్తాతగా'' అభివర్ణించారు. కథ చెప్పడం భారతీయ జీవితాలతో ముడిపడి ఉందనీ, "మన అమూల్య ఇతిహాసాల నుంచి పౌరాణిక కథల వరకు, కథ చెప్పడం మన వారసత్వం. కంటెంట్‌దే ప్రధాన పాత్ర – మంచి కథలు ఎల్లప్పుడూ అమ్ముడవుతుంటాయి. ఈ కాలాతీత సూత్రం ప్రపంచ వినోదానికి పునాది" అని అన్నారు.

"భారత్ నుంచి తదుపరి ప్రపంచ వినోద విప్లవాన్ని నిర్మించడం'' గురించి ఉత్తేజకరంగా, ముందుచూపుతో ప్రసంగించిన అంబానీ... ప్రపంచ వినోద పరిశ్రమకు కేంద్రంగా భారత్ నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మార్పునకు ప్రేరణగా నిలిచిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతను ఆయన ప్రశంసించారు. ఆ దిశలో వేవ్ సమ్మిట్ ఒక చారిత్రాత్మక ముందడుగని ప్రశంసించారు. "మీడియా – వినోదం భారత సాఫ్ట్ పవర్ అని ప్రజలు అంటారు. నేను దానిని భారత నిజమైన శక్తి అంటాను" అని అంబానీ పేర్కొన్నారు. ప్రపంచ వినోదంలో మన దేశ సృజనాత్మక, సాంస్కృతిక, సాంకేతిక బలాన్ని వేవ్స్ ప్రదర్శిస్తుందన్నారు.

సృజనాత్మకతను పునర్నిర్మించే రెండు టెక్టోనిక్ మార్పులైన భౌగోళిక–ఆర్థిక, సాంకేతికతలను ఆయన ప్రస్తావించారు. ప్రపంచ జనాభాలో 85 శాతం మంది నివసిస్తున్న దక్షిణార్ధ గోళ దేశాల ఆర్థిక సామర్థ్యం పెరుగుతున్న కొద్దీ, కంటెంట్ సృష్టి, వినియోగంలో ఈ ప్రాంత పాత్ర కూడా పెరుగుతోంది. అదే సమయంలో, కృత్రిమ మేధ వంటి అత్యాధునిక సాంకేతికతలు కంటెంట్ సృష్టి నుంచి పంపిణీ వరకు వినోద రంగ వాల్యూ చెయిన్‌లోని ప్రతి దశలోనూ విప్లవాత్మక మార్పులు తెస్తున్నాయి. "ఊహకు, అమలుకు మధ్య సరిహద్దులను ఏఐ చెరిపేస్తోంది. ఒక శతాబ్దం కిందట సినిమా కోసం మూకీ కెమెరా చేసిన దానికంటే నేడు వినోదం కోసం ఏఐ చేస్తున్నది మిలియన్ రెట్లు ఎక్కువ మార్పులు కలిగిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు.

భారత ప్రత్యేక బలాలను ప్రధానంగా ప్రస్తావిస్తూ, దేశం బలమైన కంటెంట్, డైనమిక్ డెమోగ్రఫీ, సాంకేతిక నాయకత్వం అనే మూడు ప్రాథమిక ఆధారాలతో వినోద విప్లవానికి దేశం నాయకత్వం వహించడానికి సిద్ధంగా ఉందని అంబానీ అన్నారు. "భారత డిజిటల్ విప్లవం కేవలం ఒక స్థాయి కథ కాదు. ఇది ఆకాంక్ష, ఆశయం, పరివర్తనల కథ'' అని ఆయన ప్రకటించారు.

''పోలరైజ్డ్, అనిశ్చిత ప్రపంచంలో, ప్రజలు ఆనందం, సంబంధం, ప్రేరణను కోరుకుంటారు. ప్రపంచ వినోద ఆకాంక్షలను భారత్ నెరవేరుస్తుంది. భారత్‌ను ప్రపంచానికి ఆశావహ సందేశంగా వేవ్స్ నిలపనుంది." అంటూ అంబానీ తన కీలక ప్రసంగాన్ని ముగించారు.

# నటనంటే నాకు చిన్నతనం నుంచీ అమితమైన ప్రేమ: చిరంజీవి

న్యూఢిల్లీ, మే 2:ముంబయిలోని ప్రఖ్యాత జియో వరల్డ్ సెంటర్ లో మొట్టమొదటి వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్ టైన్ మెంట్ సమ్మిట్ (వేవ్స్) దిగ్గజాలు – విజయాలు–భారత ఆత్మను తీర్చిదిద్దిన కథలు – అనే అంశంపై చర్చతో ఘనంగా ప్రారంభమైంది. కథ చెప్పడం, సృజనాత్మకత, సాంస్కృతిక వారసత్వంపై ఆకట్టుకునే రీతిలో జరిగిన చర్చలో– ఈ సెషన్ భారతదేశ అత్యంత గౌరవ సినీ ప్రముఖులలో కొందరిని ఒకే వేదికపైకి తెచ్చింది.

ప్రారంభ ప్యానల్‌లో ప్రసిద్ధ నటీమణి హేమామాలిని, ప్రముఖ నటులు మోహన్‌లాల్, చిరంజీవి పాల్గొన్నారు. ఈ చర్చను సూపర్‌స్టార్ అక్షయ్ కుమార్ నిర్వహించారు.

ఈ సందర్భంగా డ్రీమ్ గర్ల్ హేమమాలినీ మాట్లాడుతూ "ఇది భారత ప్రభుత్వం ప్రారంభించిన అందమైన ప్రారంభం. దీనిలో భాగమవ్వడం నాకు ఆనందంగా ఉంది. ప్రధానమంత్రి మోదీకి కృతజ్ఞతలు. ఆయన దృష్టికోణం, నాయకత్వమే చింఇఖాను... సృష్టికర్తలు, ఆవిష్కర్తల కోసం ఒక విశిష్టమైన వేదికగా తీర్చిదిద్దాయి" అని అభినందించారు.

సినిమా రూపాంతరం చెందుతున్న తీరుపై ప్రముఖ మలయాళ నటుడు మోహన్‌లాల్ తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. "కళాత్మక సినిమా, వినోదాత్మక సినిమా మధ్య గల రేఖ చాలా చిన్నది. ఎందుకంటే కళాత్మక సినిమాల్లో కూడా వినోదం ఉంటుంది. నేను కళాత్మక సినిమానా, లేక వాణిజ్య సినిమానా అన్న తేడా చూడను. మనుషులను కదిలించే కథ ముఖ్యం" అని పేర్కొన్నారు.

ప్రముఖ నటుడు చిరంజీవి తన సినీ ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. నటన పట్ల తన అపారమైన ఆసక్తి గురించి, నిష్కళంకమైన కృషి గురించి వివరించారు. చిన్నప్పటి ఆకాంక్షలను ప్రస్తావిస్తూ "చిన్నప్పటి నుంచే నేను నటనను ప్రేమించాను.

నా లక్ష్యాన్ని ఖచ్చితంగా చేరుకోవాలన్న తపన నన్ను ఎప్పుడూ నడిపించింది. గొప్ప నటుడిగా మారేందుకు నేను ఏవిధమైన ప్రత్యేకత కలిగి ఉండాలని నేను ఎప్పుడూ నాలో నేనే ప్రశ్నించుకుంటూ ఉండేవాడిని" అని అన్నారు.

నిజాయితీ పట్ల తన నిబద్ధతను ప్రముఖంగా చెబుతూ, స్థిరంగా, నమ్మకంగా ఉండాలనే ప్రగాఢమైన ఆకాంక్షను వ్యక్తం చేశారు. "ప్రేక్షకులు నన్ను పక్కింటి అబ్బాయిలా చూడాలనేది ఎప్పటికీ నా కోరిక. అందుకే నా నటనను ఎంత వరకు సాధ్యమవుతుందో అంతవరకు సహజంగానూ, నిజాయతీగానూ ఉంచే ప్రయత్నం చేస్తాను" అని ఆయన స్పష్టం చేశారు. తనను నటుడిగా తీర్చిదిద్దిన మహానుభావులకు కృతజ్ఞతలు తెలిపారు. వారు తనపై చూపిన గాఢమైన ప్రభావాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు.

వ్యక్తిగత అనుభవాలనూ, సాధించిన విజయాలనూ భారతీయ సినిమాలో ఉన్నతస్థాయికి చేరుకున్న వారు ఆహూతులతో పంచుకునే అరుదైన అవకాశం ఈ చర్చ అందించింది.

# పోచంపల్లిలో ఐఐహెచ్‌టీఐ ఏర్పాటుకు కృషి : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



నల్గొండ, మే 2:భూదానోద్యమానికి నాంది పలికి, చేనేతకు ప్రపంచ ప్రసిద్ధి చెందిన భూదాన్ పోచంపల్లిలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ఇనిస్టిట్యూట్ (ఐఐహెచ్‌టీఐ) ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లిలో పోచంపల్లి ఇక్కత్ పరిశ్రమపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వ్యవసాయం తర్వాత అత్యధిక మందికి ఉపాధి కల్పించింది చేనేత పరిశ్రమని, రైతన్నలతో పాటు నేతన్నలను కూడా ఈ ప్రభుత్వం గుర్తించిందని, చేనేత కార్మికులు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వం చేనేత కార్మికులకు .లక్ష రూపాయల రుణాలను మాఫీ చేసిందన్నారు. హ్యాండ్లూమ్ పార్కును మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతుం దన్నారు. భూదాన్ పోచంపల్లి మండలంలో రైతు భరోసా స్కీమ్ లో టెక్నికల్ సమస్యలతో రైతులకు అందలేదని, త్వరలోనే భరోసా నిధులను విడుదల చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర చేనేత నాయకుడు తడక వెంకటేశ్, టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవ కుమార్, పోచంపల్లి బ్యాంక్ ఛైర్మన్ తడక రమేశ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పాక మల్లేశ్ యాదవ్, రాష్ట్ర నాయకుడు మురళి, జిల్లా నాయకులు గర్దాసు బాలయ్య, కళ్లెం రాఘవరెడ్డి, సామ మధుసూదన్ రెడ్డి, మర్రి నర్సింహారెడ్డి, కొట్టం కరుణాకర్ రెడ్డి, సామ మోహన్ రెడ్డి, గుణిగంటి వెంకటేశ్, నాయకులు, చేనేత కార్మికులు, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# భారత మీడియా, వినోద వ్యవస్థలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాల్లో ఒకటిగా లైవ్ ఈవెంట్స్

న్యూఢిల్లీ, మే 2:'భారత లైవ్ ఈవెంట్స్ ఆధారిత ఆర్థిక వ్యవస్థ: వ్యూహాత్మక వృద్ధి ఆవశ్యకత'పై శ్వేతపత్రాన్ని కేంద్ర సమాచార–ప్రసార, పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి శ్రీ ఎల్. మురుగన్ విడుదల చేయనున్నారు. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు సంబంధించి ఈ తరహాలో ఇదే మొదటి శ్వేతపత్రం. వేవ్స్–2025 నాలెడ్జ్ పార్ట్‌నర్లలో ఒకటైన ఈవెంట్‌ఎఫ్ ఏక్యూస్ దీనిని రూపొందించింది.

ముంబయిలో వేవ్స్ సదస్సు – 2025 సందర్భంగా మే 3న ఈ శ్వేతపత్రాన్ని అధికారికంగా విడుదల చేయనున్నారు. దేశంలో శరవేగంగా విస్తరిస్తున్న ప్రత్యక్ష ప్రసార వినోద పరిశ్రమపై సమగ్ర విశ్లేషణను అందించడంతోపాటు కొత్త ధోరణులను, అభివృద్ధి మార్గాలను, ఈ రంగంలో నిరంతర పురోగమనం కోసం వ్యూహాత్మక సిఫార్సులను ఇది వివరిస్తుంది.

భారత్‌లో లైవ్ ఈవెంట్ల రంగంలో విప్లవాత్మకమైన మార్పులు జరుగుతున్నాయి విడివిడిగా ఉన్న రంగం నిర్మాణాత్మకంగా రూపుదిద్దుకుంటోంది. దేశ సాంస్కృతిక, సృజన రంగ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసే మూలాధారంగా ఇది నిలుస్తోంది. 2024 నుంచి 2025 వరకు ఉన్న కాలం ఓ నిర్ణయాత్మక మలుపునకు కేంద్రంగా మారింది. అహ్మదాబాద్, ముంబయిలలో 'కోల్డ్ ప్లే' వంటి అంతర్జాతీయ ప్రదర్శనలతో.. ప్రపంచ స్థాయి కార్యక్రమాల నిర్వహణలో భారత సంసిద్ధతను చాటిన కాలమది.

ఈవెంట్ టూరిజం పెరగడంతో పాటు ఈ రంగంలో కీలక ధోరణులను గమనించవచ్చు. ప్రత్యేకించి సంగీత కార్యక్రమాల కోసం దాదాపు అయిదు లక్షల మంది ప్రయాణించి రావడం సంగీత పర్యాటక ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతున్న విధానాన్ని సూచిస్తుంది. వీఐపీ అనుభవాలు, మెరుగైన లభ్యత, విలాసవంతమైన ఆతిథ్యం వంటి ప్రీమియం టికెటింగ్ విభాగాలు గతేడాదితో పోలిస్తే 100 శాతం వృద్ధిని సాధించాయి. మెరుగైన అనుభవాలను పొందిన ప్రేక్షకులు పెరుగుతుండడాన్ని ఇది సూచిస్తుంది. వివిధ నగరాల్లో పర్యటనలు, ప్రాంతీయ ఉత్సవాలకు పెరుగుతున్న ఆదరణ కారణంగా ఇందులో ద్వితీయ శ్రేణి నగరాల భాగస్వామ్యం పెరిగింది.

2024లో వ్యవస్థీకృత ప్రత్యక్ష కార్యక్రమాల విభాగంలో 15% వృద్ధి నమోదైంది. ఇది అదనంగా రూ. 1,300 కోట్ల ఆదాయాన్ని అందించింది. భారత మీడియా, వినోద వ్యవస్థలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నిర్ణీత రంగాల్లో ఒకటిగా ఇది నిలిచింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఒక్కో భారీ స్థాయి కార్యక్రమం సాధారణంగా దాదాపు 2,000 నుంచి 5,000 తాత్కాలిక ఉద్యోగాలను అందిస్తుంది. ఉద్యోగ కల్పన, నైపుణ్యాభివృద్ధిలో ఈ రంగం వాటా పెరుగుతుండడాన్ని ఇది సూచిస్తుంది.

కేంద్రీకృత పెట్టుబడులు, విధానపరమైన మద్దతు, మౌలిక సదుపాయాల నవీకరణల ద్వారా.. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా అయిదు అగ్రగామి లైవ్ ఎంటర్‌టైన్ మెంట్ గమ్యస్థానాలలో ఒకటిగా నిలవడం లక్ష్యంగా భారత్ పయనిస్తోంది.

# మనోజ్ కుమార్ జ్ఞాపకాలు: ప్రముఖ దర్శకుడు, నిజమైన జాతీయవాది" వేవ్స్ బ్రేక్ అవుట్ సెషన్ భావోద్వేగం

న్యూఢిల్లీ, మే 2:వేవ్స్ 2025లో "మనోజ్ కుమార్ జ్ఞాపకాలు: ప్రముఖ దర్శకుడు, నిజమైన దేశభక్తుడు" అనే సెషన్‌తో సినీ ఉత్సాహం హృదయానికి హత్తుకునే స్థాయికి చేరుకుంది. భారతీయ చలనచిత్ర రంగంలో దేశభక్తికి మారుపేరు అయిన మనోజ్ కుమార్‌కు ఇది ఒక భావోద్వేగపూరిత నివాళి. ఈ సెషన్‌ను ప్రముఖ సినీ విమర్శకుడు, పోడ్కాస్టర్ మయాంక్ శేఖర్ నడిపించారు. ఇందులో సినీ , సాహిత్య ప్రపంచంలోని ప్రముఖులు పాల్గొని, గొప్ప నటుడు, రచయిత, దర్శకుడిగా మనోజ్ కుమార్ అందించిన విశిష్ట సినిమా వారసత్వాన్ని స్మరించుకున్నారు.

1937లో హరికిషన్ గిరి గోస్వామిగా జన్మించిన మనోజ్ కుమార్ జీవితం కూడా ఆయన సినిమాలలాగే ప్రేరణాత్మకంగా, ఎంతో భావోద్వేగంతో నిండి ఉంది. దేశ విభజన సమయంలో ఆయన బొంబాయికి వచ్చారు. ఆయనకు అప్పుడు సినిమా సంబంధాలు లేవుగానీ కలలు మాత్రమే ఉన్నాయి. ఉర్దూలో కథలు రాస్తూ కథా రచయితగా ఎదిగిన మనోజ్ కుమార్, దేశభక్తి, సామాజిక బాధ్యతతో మిళితమైన ఒక ప్రత్యేకమైన తనదైన సినిమా శైలిని ఏర్పరచుకున్నారు.

నటుడు, మనోజ్ కుమార్ కుమారుడు కునాల్ గోస్వామి తండ్రి జ్ఞాపకాలతో సెషన్ ను ప్రారంభించారు: "విభజన సమయంలో నా తండ్రి సర్వం కోల్పోయారు. కానీ తన సంకల్పాన్ని ఎప్పుడూ కోల్పోలేదు. శరణార్థి శిబిరాల్లో నివసించడం నుంచి చరిత్రలో నిలిచిపోయే కథలు ఉర్దూలో రాయడం వరకు ఆయన ప్రయాణం మొక్కవోని ధైర్యానికి నిదర్శనం. భగత్ సింగ్ తల్లిని 'షహీద్' ప్రీమియర్ షోకు తీసుకొచ్చారు. అది ఆయన దేశభక్తి. ఆయన జాతీయవాదంతో కూడిన అనేక బ్లాక్ బస్టర్ సినిమాలను సృష్టించారు. ఇది అరుదైన ఘనత'' అని ఆయన అన్నారు.

చాంద్నీ బార్, ఫ్యాషన్ వంటి ప్రశంసలందుకున్న సినిమాలకు దర్శకత్వం వహించిన జాతీయ అవార్డు గ్రహీత మాధుర్ భండార్కర్.... మనోజ్ కుమార్ సినిమా శైలిని గుర్తుచేసుకున్నారు."ఆయన పాటలను చిత్రీకరించిన విధానం అద్భుతం. ప్రతి ఫ్రేమ్ వెనుక ఒక భావం, ఒక ప్రయోజనం ఉండేది" అంటూ ఆయన ఉద్వేగానికి లోనయ్యారు. మనోజ్ కుమార్ సినిమాలు జాతీయవాదం, సామాజిక వాస్తవికతతో కూడుకొని ఉండేవని, వాటిని తన సినిమాల్లో ప్రతిబింబించే ప్రయత్నం చేశారని భండార్కర్ అన్నారు. "చాందినీ బార్" అనేక విధాలుగా మనోజ్ కుమార్ భావాలకు సరైన నివాళి'' అని భండార్కర్ అన్నారు.

ప్రముఖ రచయిత, గీత రచయిత డాక్టర్ రాజీవ్ శ్రీవాస్తవ్ ఒక స్ఫూర్తిదాయకమైన కథను పంచుకున్నారు. "ఢిల్లీలో 'షహీద్' ప్రదర్శనకు అప్పటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి హాజరయ్యారు. ఆ స్క్రీనింగ్ అనంతరం, 'జై జవాన్ జై కిసాన్' అనే తన నినాదాన్ని ఆధారంగా చేసుకుని ఒక సినిమా తీయమని మనోజ్ కుమార్‌ను లాల్ బహదూర్ శాస్త్రి కోరారు. ఆ మాటలు ఆయన మనసును తాకాయి. ముంబయికి తిరిగి వెళ్తున్న రాత్రి రైలు ప్రయాణం లోనే మనోజ్ కుమార్ 'ఉప్కార్' కథను రాశారు" అని తెలిపారు. మనోజ్ కుమార్ జీవితం సాధారణ మనిషితో మాట్లాడే సినీ మిషన్. ఈ విధంగా, ఆయన ఆత్మ... వేవ్స్ స్ఫూర్తికి అనుగుణంగా ఉంటుంది.

ప్రముఖ కాలమిస్టు, బయోగ్రాఫర్ భారతి ఎస్. ప్రధాన్ ఒక భావోద్వేగపూరితమైన ఆలోచనను పంచుకున్నారు. 'భారీ విజయం సాధించినప్పటికీ, ఆయన నమ్మశక్యం కాని రీతిలో అందరికీ చేరువయ్యాడు. అనారోగ్యంతో ఉన్నప్పుడు కూడా తన తదుపరి చిత్రం గురించి కలలు కన్నారు. అది ఆయన ఆత్మవిశ్వాసం. ఎప్పుడూ ముందు చూపే'' అని పేర్కొన్నారు. భరత్ కుమార్ గా ఆప్యాయంగా పిలుచుకునే మనోజ్ కుమార్ పద్మశ్రీ, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుతో పాటు అనేక పురస్కారాలు అందుకు న్నారు. షహీద్, పూరబ్ ఔర్ పశ్చిమ్, రోటీ కప్డా ఔర్ మకాన్, ఉప్కార్, క్రాంతి వంటి ఆయన సినిమాలు కేవలం గొప్ప సినిమాలే కాదు, సాం స్కృతిక విజయాలు కూడా. దేశభక్తిని కవితాత్మకంగా, కథ చెప్పడాన్ని ఉత్కృష్టంగా మార్చిన వ్యక్తి పట్ల ప్రేక్షకుల చప్పట్లు, సమష్టి కృతజ్ఞతా భావంతో సెషన్ ముగిసింది.

# సంస్కృతి బ్రాండ్ నిర్మాణానికి ఇంధనం ... వేవ్స్ లో ఆలోచనలు రేకెత్తించిన ప్రేమ్ నారాయణ్, ఒగిల్వీ మాస్టర్‌క్లాస్

న్యూఢిల్లీ, మే 2:వేవ్స్ తొలి రోజున ఒగిల్వీకి చెందిన చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ శ్రీ ప్రేమ్ నారాయణ్ బ్రాండ్ నిర్మాణంపై నిర్వహించిన ఆసక్తికరమైన మాస్టర్‌క్లాస్‌లో... భారత వినియోగదారుని ఆకట్టుకునే బ్రాండ్లను నిర్మించేందుకు సంస్కృతిని శక్తివంతంగా వినియోగించుకోవడంపై సమగ్ర అవగాహనను అందించారు.

"బ్రాండ్ లను నిర్మించడానికి ఇంధనంగా సంస్కృతి" అనే అంశంపై జరిగిన సెషన్ లో, బ్రాండ్ కథనాలను రూపొందించడంలోనూ, వినియోగదారుల ధోరణులను ప్రభావితం చేయడంలోనూ సంస్కృతి పోషించే కీలకపాత్రను శ్రీ నారాయణ్ వివరించారు. భారతీయ వాణిజ్య ప్రకటనలు సాంస్కృతిక సంప్రదాయాలలో మూలాలను స్థిరపరుచుకుని ఎలా అభివృద్ధి చెందాయో, అలాగే సాంస్కృతిక విలువలతో సమన్వయం సాధించిన బ్రాండ్లు ఎలా దీర్ఘకాల వినియోగదారుల నిబద్ధతను పొందే అవకాశం ఎక్కువగా ఉంటుందో శ్రీ నారాయణ్ ప్రదర్శించారు.

క్యాడ్‌బరీ ప్రకటనల ప్రయాణాన్ని ఒక ఉదాహరణగా చూపుతూ... శ్రీ నారాయణ్ చాక్లెట్‌ను లోతుగా పాతుకుపోయిన సంప్రదాయానికి ఆధునిక వ్యక్తీకరణగా నిలపడం ద్వారా, ఈ బ్రాండ్ విజయవంతంగా భారతీయ 'మీఠా' (తీపి) సంప్రదాయంలో తనను తాను ఎలా పొందుపరచుకుందో వివరించారు. ఈ సాంస్కృతిక సమన్వయం ద్వారా క్యాడ్ బరీ భారతీయ కుటుంబాల్లో ఒక ప్రత్యేకమైన, దీర్ఘకాలిక స్థానం ఏర్పరుచుకుంది. ఇది ఉత్సవాలకే కాకుండా, దైనందిన జీవితంలోని చిన్న చిన్న క్షణాలను కూడా మధురంగా మార్చింది.

ఈ సెషన్‌లో మరో విశేషాంశంగా, సాంస్కృతిక అవగాహనను వినియోగించి బ్రాండ్ ప్రయోజనాలను సమర్థవంతంగా చాటిన ఇతర ప్రచారాల గురించి కూడా ప్రస్తావించారు. ఉదాహరణకు, సియెట్ టైర్లతో సురక్షిత డ్రైవింగ్‌పై ఇచ్చిన సందేశాలు, ఫెవికాల్ హాస్యభరితమే అయినా సాంస్కృతికంగా అనుసంధానమైన కథనాలతో బ్రాండ్ గుర్తింపు, భావోద్వేగ అనుబంధాన్ని గణనీయంగా పెంచాయి.

''బ్రాండ్ లవ్'' అనే భావన కేవలం ఒక ఉత్పత్తి లక్షణాలకే పరిమితం కాదని, దాన్ని సాంస్కృతిక పరంగా పొందుపరచ వలసిన అవసరం ఉందని ఆయన చెప్పారు. ఉదాహరణకి, భారతీయ అతిథి సత్కారానికి ప్రతీకగా ఉన్న టీ అనే సాధారణ ఆలోచనను అనేక బ్రాండ్లు సృజనాత్మకంగా వినియోగించి, ఐక్యతా భావనను, ప్రాచుర్యాన్ని బ్రాండ్ అనుభవాన్ని మరింత హృదయాన్ని తాకేలా అనుభూతిని అందించాయి. అంతేకాక, భారతదేశంలోని విస్తృతమైన భాషా, సాంస్కృతిక వైవిధ్యాన్ని దృష్టిలో పెట్టుకొని, ప్రాంతీయ భావాలకి అనుగుణంగా కమ్యూనికేషన్‌ను తీర్చిదిద్దడం ఎంతగానో ముఖ్యమని శ్రీ నారాయణ్ తెలిపారు. బ్రాండింగ్‌లో ప్రాంతీయీరణ కేవలం ప్రభావవంతమైనదే కాదు... అది అవసరమని కూడా ఆయన స్పష్టం చేశారు.

ఈ మాస్టర్‌క్లాస్‌లో సాంస్కృతిక సందర్భాలు, డిజిటల్ సాంకేతికతల కలయిక వ్యాపార అభివృద్ధికి కొత్త దారులు ఎలా తెరుస్తుందో వివరంగా చర్చించారు. ప్రత్యేకంగా షారుఖ్ ఖాన్‌తో నిర్వహించిన క్యాడ్ బరీ 'మై యాడ్' ప్రచారాన్ని ఉదాహరణగా చూపుతూ... డిజిటల్ సాధనాల సహాయంతో వ్యక్తిగత స్థాయిలో ప్రేక్షకులను చేరుకోవడంతో పాటు, సాంప్రదాయకంగా భాగస్వామ్యం చేసుకునే సాంస్కృతిక క్షణాలపై దృష్టి సారించే హైపర్–పర్సనలైజ్డ్ ప్రకటనలకు ఇది మోడల్‌గా నిలిచిందని పేర్కొన్నారు.

డిజిటల్, సామాజిక వేదికలు సాంస్కృతిక సంకేతాలతో నిండి ఉన్నాయని, వాటిని లోతైన, సందర్భానుగుణమైన కథనాల కోసం సమర్థవంతంగా వినియోగించవచ్చని శ్రీ నారాయణ్ పేర్కొన్నారు. ప్రత్యేకంగా ట్రక్కర్ల కోసం రూపొందించిన ఐ టెస్ట్ మెనూ ప్రచారాన్ని ఆయన ఉదాహరణగా ప్రస్తావించారు. ఇది కేవలం ఒక నిర్దిష్ట ప్రేక్షకులకు అనుగుణంగా సందేశాన్ని వ్యక్తిగతీకరించడమే కాకుండా, ఇప్పటివరకు 42,000 మందికి పైగా ట్రక్కర్లకు లాభం చేకూర్చడం ద్వారా మానవతావాద దృక్కోణాన్ని కూడా చాటింది.

సెషన్‌ను ముగిస్తూ, శ్రీ నారాయణ్ ఒక ముఖ్యమైన విషయాన్ని స్పష్టంగా తెలియజేశారు. సంస్కృతి అనేది బ్రాండ్లు తమ వినియోగదారులను అర్థం చేసుకోవడంలో, వారి ఆఫర్లను వ్యక్తిగతీకరించడంలో, భావోద్వేగ బంధాలను ఏర్పరచడంలో ఉపయోగపడే శక్తిమంతమైన దృశ్యకోణం అని ఆయన స్పష్టం చేశారు. భారత మార్కెట్‌లో ఎదగాలనుకునే బ్రాండ్లకు ఈ సెషన్ మార్గసూచిగా నిలిచింది. భారతదేశంతో కలిసి ఎదగాలంటే, ప్రజల భాషను, సంప్రదాయాలను ఆకాంక్షలను అర్థం చేసుకుంటూ వాటిని గౌరవించడమే మార్గమని చాటి చెప్పింది.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలి.. ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



అమరావతి, మే 2:విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాల్సిన గురుతరమైన బాధ్యత అధ్యాపకులపై ఉందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పేర్కొన్నారు.పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్, అధ్యాపకులతో ఇంటర్ మీడియట్ పరీక్ష ఫలితాలపై ఎమ్మెల్యే శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో నియోజకవర్గంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఆశించిన స్థాయిలో ఉత్తీర్ణత సాధించకపోవడం బాధాకరమన్నారు.

ప్రభుత్వ కళాశాలలో నిష్ణాతులైన అధ్యాపకులు ఉన్న విద్యార్థులు వెనుకబడి పోవడానికి కారణాలను అన్వేషించాలన్నారు. మల్లాపూర్ మండలానికి చెందిన ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు కేవలం ఐదు శాతం ఉత్తీర్ణత సాధించడం పై అధ్యాపకులను మందలించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుల బోధన తీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులను గాడిలో పెట్టాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందని నొక్కి చెప్పారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తీసుకోవాలన్నారు.

విద్యార్థుల నడవడికపై తల్లిదండ్రులకు సూచనలు అందిస్తూ జవాబుదారీగా నిలవాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందని పేర్కొన్నారు. అధ్యాపకులు తమ విద్యాబోధనలో ఎలాంటి లోపం లేదని విద్యార్థులు కళాశాలకు సక్రమంగా హాజరు కావడం లేదని, కళాశాలలో మౌలిక సదుపాయాలు లేవని పలువురు అధ్యాపకులు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని, అవసరమైన బాత్రూములు, మరుగుదొడ్లు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే, విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా నోడల్ అధికారి నారాయణ, కోరుట్ల, మెట్పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, మండలాలకు చెందిన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం మున్సిపాలిటీలో సమస్యలు పరిష్కరించాలి




కరీంనగర్, మే 2: కొత్తగూడెం మున్సిపాలిటీలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కోడూరు సుజాతను కలిసి విన్నవించారు. వివిధ వార్డుల్లో మంజూరైన కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం వెంటనే చేపట్టాలని, వార్డుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, వీధి కుక్కలు, కోతుల బెడదను తగ్గించాలని, పారిశుధ్య కార్మికులు, ట్రాలీ డ్రైవర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని, "మహిళా శక్తి" క్యాంటీన్ లకు రుణాలు మంజూరు చేయాలన్నారు. రాజీవ్ పార్కులో లైటింగ్ వ్యవస్థను మరమ్మతు చేయాలని, ఓపెన్ జిమ్, త్రాగునీరు, టాయిలెట్స్ సౌకర్యాలను కల్పించాలని, సింగరేణి ప్రధాన ఆస్పత్రి వద్ద నిర్మించిన ఫౌంటేన్ ఔట్ లెట్ పనులు, వివిధ వార్డుల్లో డ్రైనేజీ, రోడ్లు, కల్వర్టు పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు.

అలాగే మంచినీటి సరఫరా లేక ప్రజలు ఇబ్బందులుపడుతున్నారని బోర్లు వేయించి, మినీ వాటర్ ట్యాంకులకు రిపేర్లు చేయించి నీటి కొరత తీర్చాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన టీఎస్ బీపాస్ పద్ధతిలో ఇంటి నిర్మాణ అనుమతి కోసం దరఖాస్తు చేసుకుంటే 1985లో చెల్లించిన ఇంటి పన్నుల బిల్లు తేవాలని అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, లేకుంటే ఎల్ఆర్ఎస్ చెల్లించాలని ఆదేశిస్తున్నారని, తద్వారా ఇంటి యజమాని అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.

16వ వార్డులో అనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌లో నెలకొన్న సమస్యలను తీర్చాలని, వైకుంఠ ధామాల్లో కనీస సదుపాయాలు కల్పించాలని తదితర సమస్యలను మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి ఆధ్వర్యంలో కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన కమిషనర్ త్వరితగతిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ వేల్పుల దామోదర్, మాజీ కౌన్సిలర్లు రుక్మాంగధర్ బండారి, వేముల ప్రసాద్ బాబు, అంబుల వేణుగోపాల్, పల్లపు రాజు, శ్రీనివాస్ యాదవ్ ఉన్నారు.

అనంతరం కొత్తగూడెం మండల తాసీల్దార్ దొడ్డి పుల్లయ్యను కలిసి సమస్యలను ప్రస్తావించారు. పట్టణంలో క్రమబద్ధీకరణ కోసం జీఓ నంబర్ 76 దరఖాస్తు చేసుకున్న ఇండ్లకు సర్వే పూర్తి చేశారని, ఇప్పటి వరకు పట్టాలివ్వకుండా నిలిపివేశారని, వెంటనే పట్టా పంపిణీ ప్రక్రియ చేపట్టాలను కోరారు. రేషన్ కార్డుల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరగా, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తానని ఆయన బీఆర్ఎస్ నాయకులకు హామీ ఇచ్చారు.

# స్నేహితుడి ఇంట్లో మహిళ మృతదేహం.. పరారీలో ఆ వ్యక్తి

లక్నో,మే 2: స్నేహితుడి ఇంట్లో మహిళ మృతదేహం కనిపించింది. ఫ్రెండ్ ఆమెపై అత్యాచారానికి పాల్పడి హత్య చేశాడని మహిళ కుటుంబం ఆరోపించింది. అయితే ఆమె ఆత్మహత్యకు పాల్పినట్లు పోలీసులు నిర్ధారించారు. పరారీలో ఉన్న స్నేహితుడి కోసం వెతుకుతున్నారు. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో ఈ సంఘటన జరిగింది. మహానగర్ ప్రాంతంలోని అద్దె ఇంట్లో 28 ఏళ్ల పవన్ నివసిస్తున్నాడు. ఏప్రిల్ 30న స్నేహితురాలైన 24 ఏళ్ల మహిళ అతడి ఇంట్లో మరణించింది. అక్కడకు చేరుకున్న పోలీసులు మహిళ మృతదేహాన్ని గుర్తించారు. పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కాగా, ఆ మహిళపై పవన్ అత్యాచారానికి పాల్పడి, గొంతు నొక్కి హత్య చేశాడని ఆమె కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఆ మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లు పోస్ట్‌మార్టం రిపోర్ట్‌లో తేలిందని పోలీస్ అధికారి తెలిపారు.

